

10 రోజులు కలెక్టర్ సెలవు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సెప్టెంబర్ 1 నుండి 10వ తేదీ వరకు జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ వ్యక్తిగత సెలవు పెట్టారు. కలెక్టర్ సెలవు పూర్తి అయ్యే వరకు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఇంచార్జి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 11 నుండి కలెక్టర్ తిరిగి ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు.

'ఆపరేషన్ గజ' సక్సెస్

అదుపులోకి ఒంటరి ఏనుగు

గుడిపాల మండలం 190 రామాపురం వద్ద పంటపొలాల్లో పనులు చేసుకుంటున్న సెల్వి, వెంకటేష్ దంపతులను చంపడంతో పాటు కార్తీక్ అనే యువకుడిని తీవ్రంగా తొక్కి గాయపరిచిన ఒంటరి ఏనుగును ఎట్టకేలకు గురువారం సాయంత్రం అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గుంపులో నుంచి తప్పిపోయిన ఏనుగు 190 రామాపురంలో అలజడి సష్టించి ఇద్దరు చంపడంతోపాటు పంటలను తొక్కి నాశనం చేసింది. ఒంటరి ఏనుగును అదుపులోకి తీసుకునేందుకు అటవీశాఖ అధికారులు బుధవారం ఫారెస్ట్ అధికారుల వద్ద ఉన్న రెండు ఏనుగులను పంపారు. ఈ క్రమంలో ఫారెస్ట్ అధికారులు పంపిన ఏనుగులు ఒంటరి ఏనుగుతో స్నేహం చేసి 197 రామాపురం వద్ద అదుపులోకి వచ్చేలాగా చేశాయి. ఒంటరి ఏనుగుని అదుపులోకి తీసుకున్న ఫారెస్ట్ అధికారులు మత్తు ఇంజక్షన్ ఇచ్చి వాహనంలో తిరుపతి జూపార్క్ తరలించారు.



అదుపులోకి తీసుకున్న ఒంటరి ఏనుగుతో పాటు అటవీ శాఖ ఏనుగులు

గజ గజ





- జనవాసాల్లోకి ఏనుగులు,
- రైతులపై దాడులు..
- తప్పని పంట నష్టాలు..
- నివారించడంలో అటవీశాఖ వైఫల్యం..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఏనుగుల పేరు వింటేనే చిత్తూరు జిల్లా ప్రజలు వణికిపోతున్నారు. జిల్లాలోని పలమనేరు, బంగారుపాళ్యం, యాదమరి, గుడపాల వంటి ప్రాంతాల్లో జనవాసాల్లోకి ఏనుగుల తరచూ వస్తూనే ఉన్నా.. అటవీశాఖ అధికారులు కట్టిడి చేయడంలో విఫలమౌతున్నారనే విమర్శలున్నాయి. పంట నష్టంతో పాటు మనుషులు, జీవాల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నా... అటవీశాఖ చర్యలు మాత్రం శూన్యం అనే చెప్పాలి. ఏనుగుల దాడి చేసిన సందర్భాల్లో హడావిడి చేసే ఫారెస్టు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ తరువాత పట్టించుకోవడం లేదు.

ప్రతి సంవత్సరంలో రోజుల తేడాలోనే ఏదో ఒక ప్రాంతంలో ఏనుగుల దాడుల వల్ల పంట నష్టంతోపాటు ప్రాణాలు కోల్పోతుండటం చూస్తూనే ఉన్నాం... ఏడాదిన్నర క్రితం బంగారుపాళ్యం మండలం టేకుమందలో ఏనుగుల గుంపు దాడిలో ఓ వ్యక్తి మృతువాత పడ్డారు. యాదమరి మండలం భూమిరెడ్డిపల్లిలో ఏనుగుల గుంపు హల్‌చల్ చేసి తీవ్రంగా పంటనష్టం కలిగించడంతోపాటు ఇద్దరు తొక్కి చంపాయి. తరచూ గుంపు నుంచి తప్పిపోతున్న ఒంటరి ఏనుగు గ్రామాలపై పడి బీభత్సం సృష్టిస్తోంది. ఇదే తరహాలో ఈనెల బుధవారం గుడిపాల మండలం 190 రామాపురం, చీలాపల్లి వద్ద ఒంటరి ఏనుగు సృష్టించిన బీభత్సం అంతా..ఇంతా.. కాదు.. సెల్వి, వెంకటేష్ అనే దంపతులు పంటపొలాల్లో పనుల కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోగా మామిడి తోటలో పనికెళ్లిన కార్తిక్ తీవ్రగాయాలపాలైన వేలూరు సిఎంసీలో చికిత్స పొందుతున్నారు. తరచూ ఏనుగులు అటవీ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తుండటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎవరూ వ్యవసాయ పొలాల్లోకి వెళ్ళేందుకు సాహశించడం లేదు.

గత పది సంవత్సరాల్లో ఏనుగుల దాడిలో 20మంది మృతువాత పడ్డారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏనుగుల దాడుల్లో మృతిచెందిన వారికి నష్టపరిహారం కింద కనీసం రూ.10 లక్షలు చెల్లించాలని హైపర్ కమిటీ సూచించింది. అయితే బుధవారం గుడిపాల మండలంలో ఏనుగు దాడిలో మృతి చెందిన దళిత కులానికి చెందిన సెల్వి, వెంకటేష్ దంపుతులకు ప్రభుత్వం రూ.5లక్షల సాయం ప్రకటించడంపై రైతుసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఏనుగుల దాడులను అరికట్టేలా ప్రభుత్వం కందకాలు తవ్వడంతో పాటు సోలార్ పెన్సింగ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. జనవాసాల్లోకి ఏనుగులు రాకుండా అటవీశాఖ అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

పెరిగిన ఏనుగుల సంఖ్య...

తమిళనాడు, కర్నాటక సరిహద్దులో ఉన్న కౌండిన్య అడవుల్లో మూడేళ్ళ క్రితం 45ఏనుగులు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు అంచానా వేశారు. అయితే ప్రస్తుతం వీటి సంఖ్య 90కు పెరిగినట్లు ఫారెస్టు అధికారులు చెబుతున్నారు. ఏనుగుల సంఖ్య పెరగడంతో పాటు అడవుల విస్తీర్ణం తగ్గడం నీరు, ఆహారం సరిపడా దొరక్కపోవడంతో ఏనుగుల గుంపులు అటవీ సమీప గ్రామాల వైపు వచ్చేస్తున్నాయి. అటవీశాఖ అధికారుల లెక్కల ప్రకారం కౌండిన్య అడువుల సమీపంలోని 28 గ్రామాల్లోకి ఏనుగుల వచ్చే అవకాశాలున్నట్లు అంచనా వేస్తున్నారు. గుంపులుగా వచ్చే ఏనుగులు జనం వాటిపై దాడి చేయనంత వరకు జనంపై తిరగబడవని, గుంపు నుండీ విడిపోయిన ఏనుగులు జనంపై దాడి చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఫారెస్టు అధికారులు చెబుతున్నారు.


2022- 23లో ఏడుగురు ఏనుగుల దాడిలో మృతువాత పడిన్నట్లు అటవీశాఖ లెక్కలు చెబుతున్నాయి. అంతేకాకుండా వందలాది ఎకరాల్లో ఏనుగుల దాడులతో పంటనష్టం జరిగింది. ప్రభుత్వం అందించే నష్టపరిహారం చెల్లింపులోనూ జాప్యంతో పాటు అంతత మాత్రంగానే ఉంటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలపై ఏనుగుల దాడులను అరికట్టేందుకు సోలార్ ఫెన్సింగ్ కంచె ఏర్పాటు చేయడంతో పాటు కందకాలు త్వవాలని రైతులు కోరుతున్నారు. గుడిపాల మండలం 190 రామాపురం ఘటనతోనైనా ప్రభుత్వం ఏనుగుల దాడులు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటుందేమో వేచి చూద్దాం....

చిక్కిన ఒంటరి ఏనుగు..

అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండండి..: జెసి

వ్యవసాయ పంట పొలాల వైపు ప్రజలు వెళ్లే సమయంలో జాగ్రత్త వహించాలని, ఒంటరి ఏనుగును అటవీశాఖ అధికారులు పట్టుకోవడం జరిగిందని అయినప్పటికీ ప్రజల అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. గుడిపాల మండలంలో బుధవారం ఏనుగు దాడిలో ఇద్దరు మరణించారని, ఆ ఏనుగును పట్టుకునేందుకు శిక్షణపొందిన జయంతి, వినాయక్ ఏనుగులను రప్పించిన అటవీశాఖ అధికారులు ఆపరేషన్ గజను విజయవంతంగా నిర్వహించి ఒంటరి ఏనుగును అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని అయినప్పటికీ పంటపొలాల వైపు వెళ్ళినప్పుడు ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం రేంజ్ సీసీఎఫ్ నాగేశ్వర రావు, డిఎఫ్ఓ చైతన్య కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరుగురు రేంజ్ ఆఫీసర్లు, 60మంది అటవీశాఖ అధికారులు, 8 మావిటీలు ఆపరేషన్‌లో పాల్గొని ఆపరేషన్ గజను విజయవంతం చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా



ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే

ఒంటరి ఏనుగు దాడిలో మరణించిన 190 రామాపురం వాసులు సెల్వి, వెంకటేష్ పార్థివదేహాలకు చిత్తూరు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, డీఎఫ్ఓ చైతన్య కుమార్ రెడ్డి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తరపున వారి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కును డీఎఫ్ఓ, ఎమ్మెల్యే చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

చిత్తూరుఅర్బన్: ఏనుగుదాడిలో బుధవారం మరణించిన గుడిపాల మండలం 190 రామాపురం గ్రామ హరిజనవాడకు చెందిన వెంకటేష్ (55) సెల్వి (48) దంపతుల మృతదేహాలకు మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దొరబాబుతో కలసి విజయం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవ నాయుడు నివాళులర్పించారు. జీజేయం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ గురజాల జగన్ మోహన్ భాదిత కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.



ఆర్థిక సాయం చేస్తున్న చెన్నకేశవ నాయుడు

పక్కాగా ఓటర్ వెరిఫికేషన్: జెసి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 6 జనవరి 2022 నుండి 31 జులై 2023 వరకు వివిధ కారణాలతో ఓటర్ జాబితాలో డిలీట్ చేయబడిన ఓట్లను వెరిఫికేషన్ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం జేసి ఛాంబర్‌లో డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి ఓటర్ జాబితా వెరిఫికేషన్‌పై ఆర్డీఓలు, తహశీల్దార్లు, బిఎల్ఓలు, విఆర్ఓలు, ఈఆర్ఓలు నియోజకవర్గ ప్రత్యేకఅధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ జిల్లాలో వివిధ రకాల కారణాలతో 6 జనవరి 2022 నుండి 31 జులై 2023 వరకు జిల్లాలోని ఓటర్ జాబితాలో డిలీట్ కాబడిన 53,537 ఓటర్స్‌ను బిఎల్ఓలు, విఆర్ఓలు, ఎలక్షన్ డిటిలు ఈఆర్ఓలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు ఇంటింటికి వెళ్లి సెప్టెంబర్ 2 (శనివారం) సాయంత్రానికల్లా వెరిఫికేషన్ పూర్తిచేసి రిపోర్టును కలెక్టర్ కార్యాలయానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. మండల, పోలింగ్ కేంద్రాల వారిగా డిలీట్ కాబడిన ఓటర్ జాబితాను బిఎల్‌ఓలకు ఇవ్వడం జరిగిందన్నారు. మరణించిన, వివాహమై వేరే చోటకు వెళ్లిన ఓటర్స్‌కు సంబంధించి ఇంటి యాజమానితో మాట్లాడి వారి నుండి ఫారం-7కు సపోర్టు డాక్యుమెంట్స్‌ను తీసుకోవాలని, యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు వేరిపికేషన్ చేసిన తర్వాత జిల్లా కలెక్టర్ ప్రతి నియోజకవర్గ పరిధిలో 100ఓట్లను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జాబితాను సోమవారం ప్రధాన ఎన్నికల అధికారికి పంపించడం జరుగుతుందన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవాని, ఎన్నికల విభాగ సిబ్బంది, ఆర్డీఓలు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, విఆర్ఓలు, బిఎల్ఓలు పాల్గొన్నారు.

ప్రతి గడపలోని సమస్య పరిష్కరిస్తా: ఎమ్మెల్యే



గ్రామంలోని సమస్యలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు

ప్రజాశక్తి- యాదమరి: ప్రతి గడపలోను సమస్యలను పరిష్కరిస్తానని పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే ఎమ్మెస్.బాబు అధికారులను ఆదేశించారు. గురువారం 12 కమ్మపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రసూల్‌నగర్ ముస్లింవాడ, గ్రామాల్లో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డికే సాధ్యమని తెలిపారు. ముస్లింవాడ గ్రామంలో గడపగడపకు వెళ్లి వారి సమస్యలను అడిగి వారి కుటుంబానికి ప్రభుత్వపరంగా అందుతున్న సంక్షేమపథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని విచారించారు. డ్రైనేజీ, సిమెంట్ రోడ్లు వ్యవస్థను మరింత మెరుగుపర్చాలని ప్రజలు వారి దష్టి తీసుకొచ్చారు. అర్హులైన వారికి పక్కాఇండ్లు మంజూరు చేయాలని కోరారు. సచివాలయ సిబ్బంది ప్రతిఒక్కరూ అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. గ్రామంలో ప్రజలు తమ గ్రామానికి సిమెంట్ రోడ్లు కావాలి ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బి.ధనుంజయరెడ్డి, ఎంపిపి అధ్యక్షులు సురేష్ బాబు, ఉపాధ్యక్షులు హరి నారాయణరెడ్డి, రవీంద్ర, మాజీ జడ్పిటిసి మనోహర్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు మనోహర్‌రెడ్డి, తహశీల్దార్ హనుమంతు, ఎంపీడీవో శివరాజ్, యాదమరి ఎస్సై సుమన్, హౌసింగ్ ఏఈ బాపిరాజు పంచాయతీరాజ్, ఇరిగేషన్ నవీన్, ఏపీఎం కల్పలత రెడ్డి, ఏపీవో బాల, సర్పంచ్ మురళి పాల్గొన్నారు.

హైవే ఏర్పాటుపై అభ్యంతరాలను పరిశీలిస్తాం..: జెసి



హైవే ఏర్పాటుకు సంబంధించి అభ్యంతరాలను రైతులను అడిగి తెలుసుకుంటున్న జెసి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: జాతీయరహదారి 219 విస్తరణకు సంబంధించి భూసేకరణ కార్యక్రమం వేగవంతంగా జరుగుతుందని, ఈకార్యక్రమంలో ఎవరికి ఎటువంటి అన్యాయం జరగకుండా చూస్తామని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి అలైన్‌మెంట్‌లో మార్పులు కావాలని అందుకు సంబంధించి పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో బైరెడ్డిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో భూములు కోల్పోనున్న రైతులతో జెసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 219 జాతీయ రహదారికి సంబంధించి విస్తరణ కార్యక్రమం చేపట్టనున్నారని, జాతీయ రహదారుల వారు నిర్ణయించిన మేరకు పలు మ్యాప్‌లను పరిశీలించారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలు పంపడం జరిగిందని జాతీయ అధికారులు జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. ఎవరికి అన్యాయం జరగకుండా చూస్తామని జెసి అన్నారు. ప్రతిపాదనలు పంపిన స్థలంను అధికారులతో కలిసి పరిశీలించారు. జాతీయ రహదారుల అధికారులు అబ్దుల్‌సలాం, సాయిరాం, పలమనేరు ఆర్‌డిఒ శివయ్య, తహశీల్దార్ కష్ణమూర్తి పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి : జెసి

క్షేత్రస్థాయిలో జరుగుతున్న గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియోకు సంబంధించి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ 18 సంవత్సరాల లోపు ఉన్న బడికి వెళ్లాల్సిన పిల్లలు బయట ఉండకూడదని జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు అన్నారు. గురువారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ బైరెడ్డిపల్లి మండలం కడపనత్తం గ్రామంలో సర్వే గురించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని ఏ విధంగా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. గ్రామంలో మొత్తం 132 మంది విద్యార్థులు పాఠశాలకు వెళ్తున్నారని ముగ్గురు మాత్రం వెళ్లడం లేదని తెలిపారు. అందులో ఒకరు మధ్యలో బడి మానేయడం జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వారితో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ వారు ఇంటి వద్ద ఉండకూడదని పాఠశాలకు తప్పనిసరిగా వారు వెళ్లేటట్లు చూడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. గ్రామంలోని మిగతా వాలంటీర్లు ఈ కార్యక్రమాన్ని ఏ విధంగా నిర్వహించారని, సచివాలయ సిబ్బంది ఏవిధంగా పరిశీలించారని ఈ సందర్భంగా ప్రశ్నించారు. సిఆర్ఎ యాప్‌లో కొన్ని ఇబ్బందులు వస్తున్నాయని ఈసందర్భంగా వాలంటీర్లు సచివాలయ సిబ్బంది జాయింట్ కలెక్టర్ దష్టికి తీసుకువచ్చారు. ఖచ్చితమైన వివరాలను పొందుపరచాలని లేకుంటే ఈ యాప్‌లో సమస్యలు రావడం జరుగుతుందని ఎస్ఎస్ సిఏపిఓ వెంకటరమణారెడ్డి అన్నారు. కార్యక్రమంలో పలమనేరు ఆర్డిఓ శివయ్య, తహశీల్దార్ కష్ణమూర్తి, ఎంఈఓ సాయి లీల సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పక్కాగా పారిశుధ్య కార్యక్రమాలు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కమిషనర్ 22వ వార్డు పరిధిలో ఆకస్మికంగా పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ తీరును తనిఖీ చేశారు. కమిషనర్ తేనెబండ ప్రధానవీధి, మహాత్మానగర్, ముత్యాలమ్మ వీధి, కెనరా బ్యాంక్‌వీధి ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఖాళీస్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేసి తరలించాలని, కొబ్బరి చిప్పలను పూర్తిస్థాయిలో తొలగించి డంపింగ్‌యార్డ్ తరలించాలన్నారు. వ్యర్థాలను తగులబెట్టకుండా అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీలు శుభ్రంగా ఉంచాలన్నారు. ప్లాస్టిక్ వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. సమయపాలన పాటించాలని, హాజరు నమోదు పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ లోకనాథం, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు కేటాయించాలి

సర్పంచ్ కోక ప్రకాష్ నాయుడు నిరసన



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 14 ,15 ఆర్థిక నిధులను పంచాయతీలకు కేటాయించాలని సర్పంచ్ల సంఘ జిల్లా అధ్యక్షులు ప్రకాష్ నాయుడు అన్నారు. గురువారం మండల సర్వసభ సమావేశం జరుగుతుండగా బిక్షాటన వేషంలో హాజరై వేదికపై ఉన్న అధికారులను బిచ్చుటన అడుగుతూ నిరసన తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన పూతనపట్టు ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు, ఎంపీపీ ప్రకాష్ నాయుడును అదుపులోకి తీసుకోవాలని అక్కడే ఉన్న సిఐ నాగేశ్వరరావును ఆదేశించారు. దీంతో ఆయన సమావేశ మందిరం నుండి అదుపులో తీసుకుని పోలీస్‌స్టేషన్ తరలించారు. పోలీసులు తీసుకెళ్లే క్రమంలో ప్రకాష్ నాయుడు స్పహ కోల్పోయి పడిపోయారు. ఈవిషయం తెలుసుకున్న పూతలపట్టు తెలుగుదేశం నాయకులు అధికసంఖ్యలో పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ధర్నా చేశారు. పూతలపట్టు ఇంచార్జ్ మురళి మాట్లాడుతూ సమావేశ మందిరంలోకి పోలీసులు అనుమతి లేదని అధికారపార్టీ నాయకులకు పోలీసులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సర్పంచ్ ప్రకాష్ నాయుడుకు ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడిందని ఇందుకు బాధ్యులైన పోలీసులపై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.8660 కోట్లను దారి మళ్ళించారని, ఆ నిధుల వలన పంచాయతీ అభివద్ధి చెందకపోగా పంచాయతీలలో సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా కొనసాగుతున్నారని, పంచాయతీలకు రావాల్సిన నిధులను ఎప్పటికప్పుడు మంజూరు చేసి పంచాయతీ అభివద్ధికి పాటుపడాలని పలువురు నాయకులు సర్పంచులు కోరారు. టిడిపి మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, ప్రధానకార్యదర్శి జనార్దన్ గౌడ్, కమల్‌నాథ్‌రెడ్డి లోకనాథ్ నాయుడు, కొండూరు శివ పాల్గొన్నారు.



సర్పంచ్ ప్రకాష్ ని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు

ప్రజాశక్తి- పుంగనూరు: పంచాయతీ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాల అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. గురువారం పుంగనూరు ఆర్డీవో కార్యాలయం ఆవరణంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గంగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికులను నిర్లక్ష్యం చేయడం సరైంది కాదన్నారు. కరోనా సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల కోసం పనిచేసిన కార్మికుల సమస్యలు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పేద కార్మికులంటే అంత అలుసా అన్నారు. గ్రామీణ ప్రాంతంలో మంచి నీరు, పారిశుధ్యం, వీధిలైట్లు అన్ని పనులు చేస్తున్నది వీరేనన్నారు. వీరిలో అత్యధికంగా దళితులు అంటే వీరిపై ప్రేమ ఇదేనా అని ధ్వజమెత్తారు. ఇచ్చే వేతనాలు అతి తక్కువగా ఇస్తూ వాటిని కూడా నెలలు తరబడి బకాయి పెట్టడం సిగ్గుచేటు అన్నారు. స్వచ్ఛ భారత్ కార్మికులకు 15వ ఆర్థిక నిధులు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ఇవ్వకుండా దారి మళ్లించి వాడుకోవడం సిగ్గుగా లేదా అని విమర్శించారు. ఇప్పటికైనా బకాయిలు చెల్లించి, కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకట రమణ, కోశాధికారి రామకష్ణలు ప్రసంగించారు. అనంతరం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతనకమిటీ ఎన్నిక పుంగనూరు మండలం పంచాయితీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ కమిటీ అధ్యక్షులు బుడ్డన్న, కార్యదర్శి ఆనంద్, ఉపాధ్యక్షులు రాజేంద్రనాయక్, యుగంధర్ నాయక్, సహాయం కార్యదర్శులుగా భాస్కర్,కోశాధికారిగా రవితో పాటు 8మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

వరసిద్ధుని సేవలో సమాచారశాఖ మంత్రి



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సినిమాటోగ్రఫీ, వెనుక బడిన తరగతుల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కష్ణ గురువారం మధ్యాహ్నం కుటుంబ సమేతంగా శ్రీకాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. దర్శనార్థం విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనాలతో స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మంత్రి వెంట కాణిపాకం ఏఈఓ కష్ణారెడ్డి, సూపరింటెండెంట్ రంగస్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాబు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రబ్బానీ బాష, తహశీల్దార్ సుశీల, అధికారులు పాల్గొన్నారు.

2న జాబ్ మేళా

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెప్టెంబర్ 2వ తేదీ జరగబోవు జాబ్ మేళాను నియోజకవర్గ నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ వైయస్సార్ వర్ధంతి సందర్భంగా సీడాప్ డిఆర్‌డిఏ సహకారంతో ఈనెల 2వ తేదీన కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో బెంగళూరు, చెన్నై, తిరుపతి ప్రాంతాల నుండి దాదాపుగా 20 పరిశ్రమల ప్రతినిధులు పాల్గొంటున్నట్టు తెలిపారు. ఈ జాబ్‌మేళాను నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడానికి తలపెట్టినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో పాల్గొనాలనుకునే నిరుద్యోగ యువత 18 నుంచి 35 సంవత్సరాల వయసు మధ్యగల వారై ఉండాలనీ, వారందరూ తమ విద్యార్హత సర్టిఫికెట్లు, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ సర్టిఫికెట్లతో పాటు ఆరు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో జాబ్ మేళా ప్రాంతానికి సెప్టెంబర్ రెండవ తేదీన ఉదయం 9 గంటలకల్లా హాజరుకావాలని తెలిపారు. కుప్పం నియోజకవర్గ నిరుద్యోగ యువత ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా యువగళం విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి- గంగవరం: యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 200 రోజులు దిగ్విజయంగా పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని గంగవరంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. స్థానిక సాయిబాబా ఆలయంలో ప్రత్యేకపూజలు చేసి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ర్యాలీగా జాతీయ రహదారి మీదుగా పార్టీ కార్యాలయానికి చేరుకొని భారీగా బాణాసంచా పేల్చి కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మురళి, మొగల్‌రెడ్డి, రహీం, సుబ్రహ్మణ్య రెడ్డి, శ్రీనివాస నాయుడు, ప్రకాష్ నాయుడు పాల్గొన్నారు.



పలమనేరు: యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 200 రోజులు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని పలమనేరులో ఆ పార్టీ నాయకులు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. స్థానిక మారెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ర్యాలీగా పలమనేరు మార్కెట్ యార్డ్ వద్దకు చేరుకుని అన్నా క్యాంటీన్ ఎదుట భారీగా బాణాసంచా పేల్చి కేక్ కట్ చేసి పలువురికి పంచి పెట్టారు. పట్టణ ప్రధాన కార్యదర్శి గిరిబాబు, రామచంద్ర నాయుడు, ఆర్‌బీసి కుట్టి, సుబ్రమణ్యంగౌడ్, నాగరాజు, నాగభూషణం,నాగిరెడ్డి, అమరనాథ



రెడ్డి, నాగరాజు రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఆనంద, ఈశ్వర్ పాల్గొన్నారు.

శాంతిపురం: మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం యువగళం పాదయాత్రకు మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు సంఘీభావంగా పాదయాత్రను నందమూరి తారక రామారావు సర్కిల్ వరకు నిర్వహించారు. నియోజకవర్గ ఇన్చార్జ్ పిఎస్ మునిరత్నం, త్రిలోక్, సత్యేంద్ర శేఖర్, శాంతారాం, వెంకీ, పివి నాగరాజ్, విజయరామ్‌రెడ్డి, ఆర్ఎస్ మణి, ఏఎంసి నాగరాజు పాల్గొన్నారు.

గుడిపల్లి: పాదయాత్రకు సంఘీభావంగా మండలంలోని రాళ్ల గంగమ్మ దేవస్థానం నుండి గుడిపల్లి ఆర్టీసీ



బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ జెడ్పిటిసి బెటప్ప నాయుడు, మాజీ ఎంపీపీ మునిరాజు, క్లస్టర్ ఇంచార్జ్ హేమంబర్ గౌడు, యువత అధ్యక్షులు వెంకటేష్, పంచాయతీ పార్టీ అధ్యక్షులు జి.మంజునాథ్ పాల్గొన్నారు.

రామకుప్పం: యువగళం పాదయాత్రతో వైసీపీ



అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయని టీడీపి ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, కుప్పం ఇంచార్జీ మునిరత్నం, మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి బెందార్లపల్లి వరకు సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో చలపతి, విజ్రయెడ్డి, బాలు,సుబ్రీ, విశ్వనాథ్, సతీష్, అవినాష్, ఆదిల్, మంజునాథ్ తదితులున్నారు

కుప్పం: పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకుని దిగ్విజయంగా కొనసాగుతుండడం పై ఆనందం వ్యక్తం చేసిన కుప్పం తెలుగు తమ్ముళ్లు విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం నాడు ఉదయం పట్టణంలోని చెరువు కట్ట నుండి తంబిగానిపల్లి చంద్రన్న వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వరకు పెద్ద ఎత్తున పాదయాత్ర నిర్వహించారు.

మంత్రికి గంగజాతర ఆహ్వానం



ప్రజాశక్తి- నగరి: నగరి పట్టణంలో సెప్టెంబరు 12,13వ తేదీల్లో గంగజాతర నిర్వహించనున్న నేపథ్యంలో జాతర కమిటీ సభ్యులు మంత్రి ఆర్కేరోజాను సాంప్రదాయబద్ధంగా ఆహ్వానించారు. గురువారం మంత్రి నివాసానికి విచ్చేసిన వారు మంత్రికి ఫలపుష్పాలను అందించడంతో పాటు గంగమ్మ అమ్మవారి పేరుతో తొలిసారిగా సిద్ధం చేసిన కండువాను ప్రప్రథమంగా మంత్రికి వేసి ఆహ్వానించారు. ఈసందర్భంగా జాతర నిర్వాహకులు మాట్లాడుతూ సెప్టెంబర్ 5వ తేదీన జాతర చాటింపు, 12, 13వ తేదీల్లో గంగజాతర నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ దేవత దేశమ్మ దేవాలయాన్ని రూ.1.20 కోట్ల ఖర్చుతో పునర్నిర్మిస్తున్నందుకు, ఆలయానికి టీటీడీ నుంచి శేషవస్త్రములు, పూలఅలంకరణ, పందిళ్లు, విద్యుత్ అలంకరణను సౌకర్యాలు కల్పించినందుకు మంత్రికి కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, జాతరకమిటీ పెద్దలు చిరంజీవిరెడ్డి, జ్యోతిరెడ్డి, సుబ్రమణ్యం, దేశమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు వేణుబాబు, కౌన్సిలర్లు దయానిధి, గోపాల్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, నాయకులు మణిగండ, బాలాజి, శ్రీనివాసులు, షణ్ముగం, వాసు, శంకర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి కుంబాభిషేక

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి- కుప్పం: కుప్పం నియోజకవర్గం గుడుపల్లి మండల పరిధిలోని శ్రీమల్లేశ్వర స్వామివారి కుంబాభిషేక గోడపత్రికలను రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ద్రావిడ కూడలిలోని మల్లప్ప కొండపై వెలసిన మల్లేశ్వరస్వామి భక్తుల కోరికలు తీర్చే దైవంగా ప్రతినిత్యం పూజలు అందుకుంటున్నారని అన్నారు. స్వామివారి దర్శనార్థం ఆంధ్ర తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల నుంచి స్వామివారి భక్తులు ఇక్కడకు వస్తుంటారని తెలిపారు. ప్రస్తుతం మల్లప్పకొండపై నూతన విమాన గోపుర, కళశ ప్రతిష్ఠ, జీర్ణోద్ధరణ మహా కుంభాభిషేకం సెప్టెంబర్ 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమాలలో స్వామివారి భక్తాజులు పాల్గొని, స్వామివారి కపకు పాత్రులు కావాలని కోరారు.

ఎంసీఏ విద్యార్థులకు వీడ్కోలు



ప్రజాశక్తి- గంగవరం: మదర్ థెరిసా విద్యాసంస్థల్లో చదువు పూర్తి చేసుకున్న ఎంసీఏ విద్యార్థులకు వీడ్కోలుసమావేశం నిర్వహించినట్లు కళాశాల అకాడమిక్ అధికారి రాజేంద్రుడు తెలిపారు. 2022- 23 సంవత్సరం సంబంధించిన విద్యార్థులు తమ కోర్సులు పూర్తి చేసుకున్నారని వీరులు ఎక్కువభాగం గతంలో నిర్వహించిన ఉద్యోగమేళాలు ఉద్యోగాల సంపాదించుకున్నారని కోర్సు పూర్తి అయినందున వారు ఉద్యోగాలకు వెళతారని ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించిండంతోపాటు విద్యార్థులకు సర్టిఫికెట్లు మంజూరు చేసి వారి సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఆటల దినోత్సవం



ప్రజాశక్తి- వెదురుకుప్పం: వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆటలదినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణశారద చేతుల మీదుగా ఆటల పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వారి జీవితంలో క్రమశిక్షణతో ఉన్నతంగా ఎదగటానికి ఆటలు ప్రధానపాత్ర పోషిస్తాయన్నారు. కంప్యూటర్ యుగంలో అందరూ ఆన్లైన్ ఆటలే ఆడుతున్నారని తద్వార మానసిక వికాసం తగ్గుతుందన్నారు. క్రీడల వలన శారీరక దఢత్వంతో పాటు స్వీయనియంత్రణ ఉంటుందన్నారు.కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఏసి.భరణీనాథ్ రెడ్డి విద్యార్థులకు పోటీలు నిర్వహించి పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ప్రభాకర్ రావు, ఐక్యుఏసి కోఆర్డినేటర్ డాక్టర్ పూడి వెంకటేష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'బాబుతోనే.. భవిష్యత్తుకు గ్యారెంటీ..'



ప్రజాశక్తి- పలమనేరు: చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ అని పలమనేరు తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. పలమనేరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం భవిష్యత్తు గ్యారెంటీ – ఇది బాబు గ్యారెంటీ అనే కార్యక్రమంపై నియోజకవర్గ చర్చవేదిక జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఏఎంసీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భవిష్యత్తుకు గ్యారెంటీ – ఇది బాబు గ్యారెంటీ కార్యక్రమాన్ని క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలు నెలరోజుల పాటు గ్రామస్థాయిలో విస్తత ప్రచారం చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఓటర్ వెరిఫికేషన్, బాట్ యాప్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో బైరెడ్డిపల్లి, గంగవరం, పలమనేరు, పెద్దపంజాణి మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ, సోమశేఖర్ గౌడ్, నాగరాజు రెడ్డి, ఆనంద, నాయకులు గిరి, నాగరాజు, చాంద్‌బాషా, సుబ్రమణ్యంగౌడ్, గణేష్, ఈశ్వర్ గౌడ్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు శివకుమారి పాల్గొన్నారు.

మండల స్థాయి బూత్ కమిటీలు ఏర్పాటు




ప్రజాశక్తి - పాలసముద్రం: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పాలసముద్రం మండల ప్రెసిడెంట్ పుష్పరాజు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కష్ణజిమ్మాపురం, ఎస్ఆర్ఆర్. కండ్రిగ, సింహరాజపురం, పాలసముద్రం, వెంగళరాజుకుప్పం పంచాయతీలలో విస్తతంగా పర్యటించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈసందర్భంగా జిల్లా డిసిసి వైస్‌ప్రెసిడెంట్ అడ్వకేట్ మనీకష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మండల, బూత్‌స్థాయి కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ సెల్‌స్పోక్స్ పర్సన్ బండ్ల సుబ్బరాయుడు, ఎస్ఆర్.పురం మండలం గౌరవాధ్యక్షులు పిచ్చయ్య, బీసీసెల్ ప్రెసిడెంట్ గాంధీ, మండల ఎస్సీసెల్ ప్రెసిడెంట్ పాండియన్, ఎస్ఆర్ఆర్ కండ్రిగ యూత్ ప్రెసిడెంట్ నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

7న గోకులాష్టమి వేడుకలు

క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో సెప్టెంబరు 7వ తేదీన గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గోసంరక్షణశాలలో గోపూజ, సాంస్కతిక కార్యక్రమాలు చేపడతారు. టీటీడీ హిందువుల అతిముఖ్యమైన పండుగలలో ఒకటైన జన్మాష్టమి వేడుకలను తిరుపతిలో ప్రతి ఏడాదీ అత్యంత ఘనంగా నిర్వహిస్తోంది. శ్రీ కష్ణగోలోకాన్ని తలపించే విధంగా టీటీడీ శ్రీవేంకటేశ్వర గోశాలలో ఏర్పాట్లను చేయనుంది. సాయంత్రం 6 గంటలకు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథ కార్యక్రమం నిర్వహించనున్నారు.

ధనంజయ రెడ్డిని సత్కరించిన డిప్యూటి సిఎం

ప్రజాశక్తి- కార్వేటినగరం: పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. గురువారం ఎర్రమరాజుపల్లి మాజీ ఎంపిటిసి, జిల్లా వైసీపీ కోశాధికారి పుత్తూరు ధనంజయరెడ్డిని నియమిస్తూ డిప్యూటీ సిఎం ఉత్తర్వులు అందజేశారు. అనంతరం ధనంజయరెడ్డికి శాలువల కప్పి సత్కరించారు. ఈసందర్భంగా ధనంజయరెడ్డి మాట్లాడుతూ పదవి వచ్చినందుకు సిఎం జగన్మోహన్ రెడ్డికి, డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, జిల్లా పార్టీ అధ్యక్షులు భరత్‌కి కతజ్ఞతలు తెలియజేశారు. 2024 ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల కోసం కషి చేస్తానని పేర్కొన్నారు. ధనంజరెడ్డికి కోశాధికారిగా పదవి రావడంపై వైసీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జీడినెల్లూరు నియోజకవర్గంలో నారాయణస్వామిని ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీతో గెలిపించడానికి ఓటరు సిద్ధంగా ఉన్నారని ఇందుకోసం ప్రతి కార్యకర్త, నాయకులు కషి చేయాలని పిలుపునిచ్చారు.



ధనంజయ రెడ్డిని సన్మానిస్తున్న మంత్రి నారాయణస్వామి

శానిటేషన్ సక్రమంగా లేదు

కౌన్సిల్ సమావేశంలో సమస్యల వెల్లువ

ప్రజాశక్తి- పుంగనూరు: పట్టణంలో శునకాలు బెడద ఎక్కువగా ఉన్నాయని ఎక్కడ చూసినా జనంపై పడి కరవడం చేస్తున్నాయని వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని 17వ వార్డు కౌన్సిలర్ జి.రెడ్డమ్మ డిమాండ్ చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఛైర్మన్ అలీమ్ బాష అధ్యక్షతన గురువారం కౌన్సిల్ హాల్లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో శు నకాల బెడద ఎక్కువ అయిందని వీధుల్లో ఎక్కడ చూసినా ప్రజలపై కుక్కలు దాడులు చేసి గాయపరుస్తున్నాయని ఆరోపించింది. గతంలో పెంపుడు శునకాలకు బిల్లలు ఇస్తుండే వారిని ప్రస్తుతం వాటిని ఎందుకు ఇవ్వడం లేదంటూ ప్రశ్నించింది. పట్టణంలో అగ్నికుల క్షత్రియులకు బీసీగా గుర్తించి సర్టిఫికెట్లు మంజూరు చేశారని ప్రస్తుతం వాటిని ఇవ్వడం లేదని దీనిపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి దష్టికి కూడా తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ సమస్యకు పరిష్కారం కూడా చూపాలని సమావేశంలో తెలిపింది. 23వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ అర్షద్ అలీ మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో ఉన్న రోడ్లు గుంతలమయంతో ఇబ్బందులు పడేవారిని మంత్రి చేపట్టిన వార్డుబాట సందర్భంగా వాటన్నింటికీ తారురోడ్లు వేయడం జరిగిందని దీనికి మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 23వ వార్డులో శానిటేషన్ సక్రమంగా చేయడంలేదని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే దోమలు బెడద ఎక్కువగా ఉన్నది పాకింగ్ చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాష మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వార్డుపాటి సందర్భంగా కోటి రూపాయలతో తారు రోడ్లు వేయడం జరిగిందన్నారు. వార్డు బాటలో ఐదు ఆర్ఓ ప్లాంట్లను ప్రారంభోత్సవం చేయడం జరిగిందని అంతేకాకుండా మరో ఐదు ఆర్వో ప్లాంట్లకు అవసరాన్ని గుర్తించమని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నందుకు మంత్రి ఆదేశాలు ఇచ్చి ఉన్నారని వాటిని త్వరలో అమలు చేస్తామని చెప్పారు. మరో కోటి రూపాయలతో పట్టణంలో అభివద్ధి పనులు చేసేందుకు టెండర్లను పిలిచి త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో అజెండాను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ నరసింహ ప్రసాద్, వైస్ చైర్మన్ కొండవీటి నాగేంద్ర, మున్సిపల్ డీఈ, టిపిఎస్, ఆర్‌ఐలతోపాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు: సిఐ



ప్రజాశక్తి- పుంగనూరు: పట్టణంలో ట్రాఫిక్‌కు ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సిఐ రాఘవరెడ్డి అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సిఐ పట్టణంలో పలుప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు గురువారం చర్యలు తీసుకున్నారు. పలు దుకాణాలు ఎదుట బోర్డులు రోడ్డుపై పెట్టడంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని వాటిని తీసివేయాలని సిఐ సిబ్బందికి సూచించారు. అలాగే దుకాణం యజమానులు రోడ్డు పక్కన ట్రాఫిక్ ఇబ్బంది కలిగించకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని అన్నారు. పట్టణంలో వ్యాపారస్తులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై సలహాలుసూచనలు చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు



ప్రజాశక్తి- నగరి: నగరి ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం (పీఏసీఎస్)లో గురువారం చైర్మన్ తిరుమలరెడ్డి, సీఈవో తులసిపిళ్ళై ఆధ్వర్యంలో ఖాతాదారులకు, రైతులకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో తాడేపల్లి గూడెం సత్యకష్ణ కళాబందం వారిచే చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు. నగరి బ్రాంచి లోను, పీఏసీఎస్‌ఎస్‌లోను ఇస్తున్న వివిధ రకాల లోన్లు, డిపాజిట్లు పాటల రూపంలో వివరించారు. ఈసందర్భంగా సీఈవో తులసీ పిళ్ళై మాట్లాడుతూ భారత దేశంలో 1367 డీసీసీ బ్యాంకులు, ఒక లక్ష సొసైటీలను బలోపేతం చేయడానికి బారత ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. సహకారం ద్వారా సమద్ధి, శ్రేయస్సు పొంది సొసైటీలను ఆర్థికంగా బలోపేతం చేయాలని కోరారు. బ్రాంచి మేనేజరు సందీప్ మాట్లాడుతూ తమ బ్యాంకు నందు డిపాజిట్లు చేసేవారికి వాణిజ్య బ్యాంకులకన్నా అధిక వడ్డీరేట్ల ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా యోజన ఇన్సూరెన్స్ ఏడాదికి 436 మాత్రమే చెల్లించాలని, వయోపరిమితి 18 నుండి 50 లోపువారు మాత్రమే అర్హులన్నారు. ప్రమాదవ శాత్తు మరణించిన వారికి 2 లక్షలు బ్యాంకువారు చెల్లిస్తారన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సూపర్‌వైజర్ కె.ఆనందన్, డైరెక్టర్ ఏవీ దామునాయుడు, సొసైటీ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

సామాన్య భక్తులకు పెద్దపీట

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు
'గరుడ సేవ' రోజు ద్విచక్ర వాహనాలు రద్దు
నడక మార్గాల్లో నిబంధనలు కొనసాగింపు
జిల్లా యంత్రాంగంతో సమన్వయం
టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - తిరుమల

అధికమాసం కారణంగా ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో జరిగే రెండు బ్రహ్మోత్సవాలకు విశేషంగా భక్తులు విచ్చేసే అవకాశం ఉందని, భక్తుల సౌకర్యార్థం విస్తతంగా ఏర్పాట్లు చేపడుతున్నామని టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో గురువారం జిల్లా కలెక్టర్, ఎస్పీ, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్, టీటీడీలోని అన్నివిభాగాల అధికారులతో ఈవో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 18 నుండి 26వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 15 నుంచి 23 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. సెప్టెంబరు 18న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని వెల్లడించారు. ముఖ్యమంత్రివర్యుల చేతులమీదుగా శ్రీనివాస సేతు, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల హాస్టల్ భవనం, తిరుమలలో విశ్రాంతి గహాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగుతాయన్నారు. గరుడసేవను రాత్రి 7 గంటలకు ప్రారంభించి భక్తులందరికీ దర్శనం కల్పిస్తూ నిదానంగా ముందుకు తీసుకెళతామని తెలిపారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామని, వారికి సంతప్తికరంగా వాహనసేవల దర్శనంతోపాటు మూలమూర్తి దర్శనం కల్పిస్తామని చెప్పారు. బ్రేక్ దర్శనాలకు సిఫారసు లేఖలు స్వీకరించబడవని, స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులను మాత్రమే అనుమతిస్తామని వివరించారు. వద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు తదితర ప్రివిలేజ్డ్ దర్శనాలను రద్దు చేసినట్టు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు నిధులతో ఆలయాలు నిర్మించిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మత్స్యకార ప్రాంతాల్లోని భక్తులకు రోజుకు వెయ్యి మంది చొప్పున బ్రహ్మోత్సవ దర్శనం చేయిస్తామని తెలిపారు. వీరికి ఉచితంగా రవాణా, భోజనం, బస కల్పిస్తామన్నారు. భక్తుల భద్రత దష్ట్యా సెప్టెంబరు 22న గరుడసేవ నాడు ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాల రాకపోకలను రద్దు చేశామన్నారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు రవాణా, వైద్యం తదితర సౌకర్యాలు కల్పిస్తామని తెలియజేశారు. మీడియా సమావేశంలో శ్రీవారి ఆలయ ప్రధానార్చకుల్లో ఒకరైన వేణుగోపాల దీక్షితులు, జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్, డిఎల్వో వీర్రాజు, అదనపు ఎస్పీ మునిరామయ్య, ఆర్టీసీ ఇన్చార్జి ఆర్ఎం పాల్గొన్నారు.

ప్రజావసరాలకే ప్రాధాన్యత..

మున్సిపల్ సమావేశంలో ఛైర్మన్ పీజీ నీలమేఘం

ప్రజాశక్తి- నగరి: ప్రజావసరాలకే ప్రాధాన్యత ఇస్తూ మున్సిపాలిటీని ముందుకు తీసుకెళ్తున్నామని మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. గురువారం నగరి మున్సిపల్ కార్యాలయంలో ఆయన సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సమావేశపు అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏవైనా అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. విప్ దయానిధి మాట్లాడుతూ జగనన్న విద్యాకానుకను లాంఛనంగా ప్రారంభించడానికి నగరిలో ఏర్పాటుచేసిన సీఎం సభను విజయవంతం చేసినందుకు సహకారం అందించిన కౌన్సిల్‌కు మంత్రి తరపు ప్రతినిధిగా ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మంత్రి ఆర్కేరోజా సహకారంతో మున్సిపల్ పరిధిలో అన్ని వార్డుల్లోను ప్రజావసరాలను పూర్తిచేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. గడపగడపకు నిధుల ద్వారా వార్డుకు 20 లక్షల చొప్పున అభివద్ధికి వెచ్చించడం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వెదురుకుప్పం మండలాన్ని

తిరుపతి జిల్లాలో చేర్చాలని ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో గురువారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ బండి నాగరాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖలపై సమీక్ష, మండలంలోని గ్రామాలలో మౌలిక వసతులపై చర్చ జరిగింది. పలువులు అధికారులు ప్రతి సర్వసభ్య సమావేశానికి దుమ్మా కొడుతున్నారని వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోఆప్షన్ నెంబర్ వెంకటేశులు కోరారు. వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సుధాకర్ రావు చెప్పారు.



అనంతరం జక్కదొన సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డి వెదురుకుప్పం మండలాన్ని తిరుపతి జిల్లాలో చేర్చాలని తెలపడంతో అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈఆమోదాన్ని పైస్థాయి అధికారులకు పంపిస్తామని మండల అభివద్ధి అధికారి సుధాకర్ రావు సభ్యులకు తెలియజేశారు. జడ్పిటిసి సుకుమార్, స్థానిక ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు



ప్రజాశక్తి- కుప్పం: మండలంలోని వెండుగాంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గురువారం ఉదయం జరిగిన రోడ్డుప్రమాదంలో ఆరుగురు తీవ్రగాయాల పాలయ్యారని, అందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందంటూ స్థానికులు తెలిపారు. పలమనేరు నియోజకవర్గం వీకోట మండలనాకి చెందిన కుటుంబ సభ్యులు పౌర్ణమి సందర్భంగా తమిళనాడు రాష్ట్రంలోని తిరువన్నామలై దర్శనార్థం వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగిందన్నారు. గురువారం ఉదయం వెండుగాంపల్లి గ్రామ సమీపంలోని పలమనేరు క్రిష్ణగిరి జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న బొలెరో వాహనమ్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారులోని ఐదుగురు టాటాఏస్ వాహనడ్రైవరు గాయాలపాలవ్వగా అందులో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉందన్నారు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు 108 వాహనం ద్వారా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

ప్రజాశక్తి

ప్రతి అక్షరం - ప్రజల పక్షం

43వ వార్షికోత్సవ

ఎడివిటి ఫీచర్ - పలమనేరు | ప్రత్యేక సంచిక | 16 పేజీలు సెప్టెంబరు 2023

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

శ్రమజీవుల పత్రిక, కార్మిక, కర్షక, ఉద్యోగుల అభిమాన పత్రిక ప్రజాశక్తి నిజాన్ని నిర్భయంగా రాస్తూ, ప్రజల పక్షాన నిలిచి నేడు 43వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంగా పాఠకులకు, సిబ్బందికి, విలేకరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు

జాతీయ మానవ హక్కుల పరిరక్షణ మరియు అవినీతి నిర్మూలన సంస్థ (ఎన్‌హెచ్‌ఆర్‌పిసిఈఎఫ్)



డి.వి. మునిరత్నం, జిల్లా అధ్యక్షులు



డి. సుబ్రమణ్యం, పలమనేరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు

జి. సుబ్బమ్మ, మహిళా నియోజక వర్గ అధ్యక్షురాలు

సోమరాజు, యూత్ నియోజక వర్గ ప్రెసిడెంట్

సి. శ్రీనివాసులు, నియోజక వర్గ సహాయ కార్యదర్శి

వేలాయుధం(రాజా), జిల్లా సహాయ కార్యదర్శి

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



ఆకాశంలో తొలి తెలుగు అక్షరాన్ని సంధించి, అవినీతిపరుల గుండెల్లో నిద్రించి, సమాజ చైతన్యమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న తెలుగు దినపత్రిక ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



మోహన్ రెడ్డి, మండల కన్వీనర్, గంగవరం

పార్వతమ్మ చంద్రప్ప, జడ్.పి.టి.సి, గంగవరం

గిరి రాజా రెడ్డి, సర్పంచ్ సంఘం అధ్యక్షులు, గంగవరం

చలపతి రెడ్డి, వై.ఎస్.ఆర్. నాయకులు



శ్రీరాములు రెడ్డి, వై.ఎస్.ఆర్. నాయకులు

ప్రహ్లాద, మాజీ మార్కెట్ చైర్మన్, పలమనేరు

వెంకటరమణ, ఎం.పి.పి. గంగవరం

టి. చంద్రమ్మ, సర్పంచ్, గంగవరం గ్రామ పంచాయతీ గంగవరం మండలం

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



AMMACTS



సమాజ అభివృద్ధే లక్ష్యం ... మహిళా చైతన్యమే పరమావధిగా భావించి "మహిళా పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం (లి)" ను స్థాపించి మహిళలకు పొదుపులు అలవరిచి వారి కుటుంబాలలో వెలుగులు నింపి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు Acts, Ammacts & FinCare Bank లను స్థాపించి ఎంతోమంది మహిళలు, నిరోద్యగులకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి కుటుంబాల ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకెళ్ళేందుకు అవకాశం కల్పించారు. అదే స్ఫూర్తితో పేద విద్యార్థులకు ప్రతి యేడు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తూ.... పేద విద్యార్థులకు ఇతోధికంగా సహకారం అందిస్తున్నారు. పేదలకు స్వచ్ఛమైన త్రాగు నీరు అందించేందుకు Acts Mineral Water Plantను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో రోగులకు అవసరమైన సేవలను అందిస్తూ .... పేద ప్రజల అభివృద్ధే ధ్యేయంగా అమ్మాక్ట్స్ సంస్థ ముందుకెళ్తోంది.

ఇదే స్ఫూర్తితో 43వ వార్షికోత్సవం జరుపుకొంటున్న **ప్రజాశక్తి** దినపత్రిక యాజమాన్యానికి సిబ్బంధికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ......





మీ -

డా॥ జి. దశరథరెడ్డి,
సి.ఇ.ఓ. అమ్మాక్ట్స్
వి.కోట మండలం,
చిత్తూరు జిల్లా, ఆం.ప్ర.

బీడి కార్మికుల బతుకులు 'బుగ్గి'





ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

'పొగ తాగడం ఆరోగ్యానికి హానికరం' అనే అడ్వర్‌టైజ్‌మెంట్ చూసిన ఎవరైనా పొగతాగడం మానేస్తారు. ఎందుకంటే ఆ అడ్వర్‌టైజ్‌మెంట్ పొగ తాగడం వల్ల క్యాన్సర్ బారిన పడినవారి పరిస్థితి అంత భయానకంగా ఉంటుందనేదానికి అద్దం పడుతోంది. అయితే ఏళ్ల తరబడి ఈ అడ్వర్‌టైజ్‌మెంట్ ప్రతి సినిమా హాల్లోనూ ప్రదర్శితమవుతూనే ఉంది. అయితే పొగతాగేవారి సంఖ్య పెరుగుతూనే ఉంది తప్ప తగ్గుతున్న దాఖలా లేదు. బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నేరం అని బోర్డులు ఉన్నా అవి ప్రకటనలకే పరిమితం. అయితే ఒకటి మాత్రం వాస్తవం. కేంద్ర ప్రభుత్వ సంస్కరణల ప్రభావం అంతరాలు పెరిగాయి.. ధనికులు శత కోటీశ్వరులయ్యారు. పేదలు కడు పేదరికం అనుభవిస్తున్నారు. ఈ నేపథ్యంలో సిటిరెట్లు తాగేవారు సైతం బీడీలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో బీడీ తయారీ పరిశ్రమ ఒకింత పెరిగిందనే చెప్పవచ్చు. అయితే అందులో పనిచేసే కార్మికుల పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంది.

మనదేశంలో బీడీలు చుట్టేపని అసంఘటితరంగం.. ప్రధానంగా కార్మికుల గహాల్లో జరుగుతుంది. సిగరెట్టుతో పోలిస్తే బీడీల ధరలు తక్కువగా ఉన్నందువల్ల పేదలు ఎక్కువగా బీడీలు తాగుతారు. అందుకే బీడీలు పేదల సిగరెట్టు అని కూడా అంటారు. మనదేశం కాకుండా పాకిస్థాన్, కంబోడియా, బంగ్లాదేశ్, శ్రీలంక దేశాల్లో బీడీలను ఎక్కువగా ఉపయోగిస్తారు. మన దేశంలోనే దాదాపు 850 బిలియన్ బీడీలు తాగుతారని అంచనా.

అభివద్ధి చెందిన దేశాల్లో కూడా 31 నుండి 58 శాతం పాఠశాల విద్యార్థులు రుచి చూసినట్లు అమెరికా లోని శాన్ ఫ్రాన్సిస్కో నగరంలో జరిగిన ఒక సర్వే తెలిపింది. మనదేశంలో 17 రాష్ట్రాల్లో సుమారు మూడుకోట్ల మంది బీడీ పరిశ్రమ పై ఆధారపడి జీవిస్తున్నారు. ఒక కోటికి పైగా బీడీలు చుట్టే వారు ఉన్నారు. బీడీ ఆకులు తెంపే కార్మికులు, అడవిలో బీడీ ఆకును సేకరించే కార్మికులు, పొగాకు పండించే రైతులు, కమిషన్ ఏజెంట్లు, ఇలా ఎంతో మంది బీడీ పరిశ్రమ ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం బీడీలపై ఎన్నో ఆంక్షలు పెట్టి విదేశి సిగరెట్ కంపెనీ లను ప్రోత్సాహిస్తున్నది. ఒకే దేశం ఒకే పన్ను పేరుతో బిజెపి ప్రభుత్వం బీడీ పరిశ్రమకూ వస్తు సేవల పన్ను జిఎస్‌టీ అమలు చేసి ఆటంకాలు కల్పిస్తూ బీడీ కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తున్నది. రోజంతా 14 గంటలు బీడీలు చుట్టినా వచ్చే ఆదాయం తో డొక్క నిండడం లేదు. ఎన్ని సంవత్సరాలు పని చేసినా సాంఘీక భద్రత హామీ లేదు. కార్మికులకు చేతి నిండా బీడీ యజమానులు పని ఇవ్వడం లేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ,కార్మిక చట్టాల అమలు అందని ద్రాక్ష పండు చందంగా ఉంది. కార్మిక చట్టాలు అమలు చేయాల్సిన పాలకులు, సంబంధించిన కార్మిక, సంక్షేమ శాఖ అధికారులు బీడీ కార్మికుల గోడును పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వుంటున్నారు. బీడీ కార్మికుల రోదన అరణ్య రోదనగా ఉంది. పాలకుల ఊకదంపుడు ఉపన్యాసాల వల్ల బీడీ కార్మికులకు ఒరిగింది ఏమీ లేదు. రోజు వారీ పనిలో జరిగే శ్రమ దోపిడీకి అంతం లేదు. బీడీ కార్మికుల బతుకులను బాగు చేద్దామనే ఆలోచన పాలకులకు లేదు. బీడీ యజమానుల లాభాలకు అంతే లేదు. కార్మికుల అమాయకత్వంతో దోపిడీ దారుల ఆగడాలు మితిమీరిన రీతిలో వుంటూ కార్మికుల బతుకులు బీడీల్లా కాలిపోతున్నాయి. బీడీ కార్మికులు దారిద్ర్య రేఖ కింద వుంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురయ్యారు. జాతీయ కనీసవేతనం, ప్రావిడెంటు ఫండు అమలు, గ్రాట్యుటీ చెల్లింపు, పెన్షన్, పక్కా గహాలు, కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు, బీడీ కార్మికుల సంక్షేమ నిధి ద్వారా విధ్య వైద్య సౌకర్యం, పిల్లల పెళ్లిళ్లకు ఉచిత ఆర్థిక సహాయం అందించాల్సిన కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికుల పట్ల చిన్న చూపు తోంది.

మన రాష్ట్రంలో బీడీ కార్మికులు ఎక్కువగా రాయలసీమ జిల్లాల్లోని తాడిపత్రి, కదిరి, కమలాపురం, రాయచోటి, కడప, కర్నూలు, నంద్యాల, తిరుపతి, పుత్తూరు, సత్యవేడు, నాగలాపురం, కార్వేటినగరం, ఆవలకొండ, కుప్పం, పలమనేరు ప్రాంతాల్లో, నాయుడుపేట, బాపట్ల జిల్లాలో వేటపాళెం తదితర ప్రాంతాల్లో దాదాపు 30 వేల మంది బీడీ కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో అత్యధికమంది మైనార్టీ, దళిత కుటుంబాలకు చెందిన వారు. గంటల కొద్ది కూర్చొని బీడీలు చుట్టడం వల్ల మోకాలు, నడుము, వీపు నొప్పులు, ఆస్మా, క్షయ, గర్భసంచి తదితర వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ఉపాధి పనులు లేనందువల్ల వేరే గత్యంతరం లేక బీడీలు చుట్టడం, బీడీలకు బీడీ కంపెనీల లేబుల్స్ కార్మికుల ఇళ్ళల్లోనే అతికించడం, ఫ్యాక్టరీ యజమానుల ఆఫీసు ల్లో ప్యాకింగ్ చేయడం లాంటి పనులు చేస్తున్నారు. బీడీ ఫ్యాక్టరీ యజమానులు కార్మికులకు ప్రత్యక్షంగా పనులు ఇవ్వకుండా కాంట్రాక్టర్ల ద్వారా బీడీలు తయారు చేయించుకొంటున్నారు. కార్మికుల కు, యజమానులుకు మధ్యవర్తిగ ఉన్న కాంట్రాకర్లు కార్మికులను ఇబ్బందులు పెడుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఆ కార్మికుల కు పని ఇవ్వరు. బీడీల ఉత్పత్తి కి ప్రధాన ముడి సరుకుగా నాణ్యమైన ఆకు,.పొగాకు ను యజమానులు కాంట్రాక్టర్లకు ఇవ్వకుండా నాసి రకమైన ఆకు ఇచ్చి బీడీలు తాము నిర్దేశించిన ప్రకారమే చుట్టి ఇవ్వాలని, లేనట్లయితే కార్మికుల వేతనంలో వెయ్యి బీడీలకు ఇచ్చే కూలిలో దాదాపు రూ యాభై కోతపెట్టి కార్మికుల ను దోచుకుంటున్నారు.


యజమాని-కార్మికునికి మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించకుండా బీడీ ఆకు అమ్మకం-బీడీలు కొనుగోలు పద్ధతి ని యజమానులు ప్రవేశ పెట్టి బీడీ కార్మికుల చట్టాలను ఉల్లంఘిస్తూ పై పద్ధతిని సుప్రీం కోర్టు వ్యతిరేకించినప్పటికి యజమానులు లెక్క చేయలేదు. బీడీల ఉత్పత్తి పై వసూలు చేస్తున్న వివిధ పన్నులతో బీడీ కార్మికులకు అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలను గాలికి వదిలేసింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లులో ఒక కోడ్ ప్రకారం ఇకమీదట బీడీ కార్మికులకు వైద్య సౌకర్యాలను ఇఎస్ఐ పరిధిలోకి తెచ్చి కార్మికులను దగా చేసింది. బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలుకు నిధులు ఎలా సమీకరిస్తారో మోడీ ప్రభుత్వం చెప్పలేదు. మన రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికుల కు 2011 సంవత్సరం జూన్ 30 తేదీన వేతనాలు సవరిస్తూ ఉత్తర్వు నెంబర్ 41 ని జారీ చేసింది అయితే కొద్ది రోజులకే యజమానులు నుండి వచ్చిన వినతిపత్రం ఆధారం చేసుకుని తాను ఇచ్చిన ఉత్తర్వు 41 అమలు ని నిలిపివేస్తూ మరొక ఉత్తర్వు నెంబర్ 81 ని జారీ చేసింది. ప్రభుత్వాలు మారినా ఈ రోజు వరకు వేతనాలు సవరించలేదు. బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్య లు పరిష్కారం కోసం పోరాటాలు అనివార్యం. రాష్ట్రంలోని బీడీ కార్మికులు సంఘటితం కావాలి.




రాష్ట్ర కో-కన్వీనర్ ఆం.ప్ర.బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ
పి.చైతన్య రాష్ట్ర కో-కన్వీనర్
9490300770

విలక్షణమే 'అమాక్స్' విశిష్టత

'పొదుపు' స్ఫూర్తి ప్రదాత డాబీ జి. దశరథరెడ్డి



అమ్యాక్స్ విశిష్టతను ప్రజాప్రతినిధులకు తెలియజేస్తున్న దశరాథరెడ్డి



దశరథ రెడ్డిని సన్మానిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి- వి కోట

మహిళల అభివద్ధి, ప్రజా చైతన్యమే లక్ష్యంతో అత్యంత మారుమూల ప్రాంతాల్లోని మహిళల్లో ఆర్థిక చైతన్యాన్ని నింపిన నిగర్వి, మంచి మనసున్న మహోన్నత వ్యక్తి ఆదర్శప్రాయుడు ప్రజాసేవే లక్ష్యంగా నిరంతరం ప్రజలతో మమేకమై ప్రతిక్షణం ప్రజల బాగు కోసం తపించే మనస్తత్వంతో సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తున్న మహా మనిషి ఆమాక్స్ వ్యవస్థాపకులు డాబీ జి దశరథ రెడ్డి. సమాజంలో మహిళలు ఆర్థిక శక్తిగా ఎదిగినప్పుడు వారి కుటుంబాలు తద్వారా ఆ ప్రాంతం అభివద్ధి సాధించగలుగుతుందన్న నమ్మకంతో 1988 లో వీకోట కేంద్రంగా అమాక్స్ మహిళ పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం ను స్థాపించారు అప్పట్లో కేంద్ర ప్రభుత్వం అందించిన 47 వేల రూపాయల ఆర్థిక సహాయంతో తన సేవా కార్యక్రమాలను విస్తత పరిచారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అన్ని విధాలుగా సహకరించి వారికి అండగా నిలిచారు. రైతన్నలు బాగుపడినప్పుడే దేశం బాగుపడుతుందని భావించి తమ సంస్థ ద్వారా రైతుల అభివద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు . నీటి నిల్వలకు విరివిగా చెక్ డ్యాం ల నిర్మాణాలు చేపట్టారు. మండలంలో వెనుకబడిన వర్గాల అభివద్ధికి వెదురు బుట్టలు , చాపలు అల్లే కుటుంబాలకు వారి ప్రాంతంలోనే కుటీరపరిశ్రమగా అభివద్ధి పరచడానికి ఆర్థిక , సాంకేతిక తోడ్పాటు అందించారు. మండలంలోని అటవీ సరిహద్దు ప్రాంతాల్లో గిరిజన సహకార సంఘం ద్వారా అటవీ ఫలసాయం సేకరణకు విశేషంగా కషి చేశారు. ప్రముఖ సంఘ సేవకులు జి ఎన్ రెడ్డి ని తన గురువుగా భావించి వారి స్ఫూర్తితో తమ సేవలను కర్ణాటక , తమిళనాడు రాష్ట్రాలకు విస్తరించారు. ఆక్ట్స్ ,ఆమాక్స్, ఫిన్ కేర్ బ్యాంక్ ల భాగస్వామ్యం తో ఎంతోమంది మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకెళ్లేందుకు తోడ్పాటునందింస్తున్నారు. పేద విద్యార్థులకు స్కాలర్షిప్ లు అందిస్తూ ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోని రోగులకు విశేషంగా తన సేవలను కొనసాగిస్తున్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో లాభాపేక్ష ఆశించకుండా మినరల్ వాటర్ ప్లాంట్ ను స్థాపించి ప్రజలకు తక్కువ ధరతో స్వచ్ఛమైన త్రాగునీటిని అందిస్తున్నారు. మహిళల ఆర్థిక అభివద్ధి సమాజసేవే లక్ష్యంతో ప్రారంభమైన అమాక్స్ కొన్ని లక్షల జీవితాల్లో వెలుగులు నింపుతోంది . ఆకలితో ఉన్న కడుపును , ఖాళీగా ఉన్న జేబును. , కష్టసుఖాలను ఎదుర్కొని ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగినా ప్రజల కోసం ఇంకా ఏదో చేయాలన్న తపనతో నిరంతరం శ్రమిస్తున్న శ్రమజీవి దశరథరెడ్డి ధన్యజీవి.

ప్రజలతో 'ప్రజాశక్తి'

'ప్రతి అక్షరం ప్రజల పక్షం' అంటూ ప్రజాశక్తి దినపత్రిక 43వ వసంతంలోకి ప్రవేశించింది. 1981 ఆగస్టు ఒకటో తేదీన ప్రజాశక్తి దినపత్రికగా వెలువడింది. 1980వ దశకంలో తెలుగునాట సాగిన అఖిలపక్ష రైతు ఉద్యమం, తదనంతరం ఎగసిన కాంగ్రెస్ వ్యతిరేక వెల్లువకు ఆలంబనగా నిలిచింది. 90వ దశకంలో దేశవ్యాప్తంగా వచ్చిన నయా ఉదారవాద విధానాలు, వాటితోపాటే రాష్ట్రంలో ప్రపంచబ్యాంకు సంస్కరణలతో ప్రజలకు కలుగుతున్న నష్టాన్ని, రానున్న ప్రమాదాల గురించి వివరించింది. వినాశకర విధానాలకు వ్యతిరేకంగా పోరాడే కార్మిక, కర్షకులకు, విస్తార ప్రజా సమూహాలకు మద్దతుగా నిలిచింది. 2000వ దశకంలో పాలకులు బషీర్‌బాగ్‌లో, ముదిగొండలో తూటాల వర్షం కురిపించి నిండు ప్రాణాలను బలిగొన్నా, ఆ ఉద్యమాలన్నింటిలోనూ ప్రచారాందోళన సాధనంగా ప్రజాశక్తి తనవంతు పాత్ర పోషించింది.

దేశంలో నయా ఉదారవాద విధానాలకు తోడు మతతత్వ శక్తులూ పెరిగాయి. ఐక్యంగా ఉన్న ప్రజల మధ్య విద్వేష సృష్టికి మతోన్మాదులు అయోధ్య మొదలు వారణాసి, మధుర వరకు అనేక వివాదాలను లేవనెత్తి రావణకాష్టాన్ని రగిలిస్తున్నారు. కార్పొరేట్ మతతత్వ కూటమి పాలనలో ప్రజాస్వామ్యం, స్వావలంబన, లౌకికతత్వం, సామాజిక న్యాయం హరించి వేయబడుతున్నాయి. రాజ్యాంగానికి ముప్పు ఏర్పడింది. నిరంకుశ ధోరణులు ప్రబలుతున్నాయి. అటవీ హక్కులకు పాలకులు తూట్లు పొడుస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు, దేశానికి తీవ్ర హాని కలిగించే పరిణామాలన్నింటిపైనా పాఠకులకు ముందస్తు సమాచారాన్ని అందించడంలో ప్రజాశక్తి ముందుంది.


తిరుపతి ఎడిషన్

దేశ సమైక్యత, సమగ్రత పరిరక్షణకు, ప్రజల ఐక్యతను కాపాడడం కోసం అన్ని సందర్భాల్లోనూ నికరంగా నిలిచింది.

భాషా ప్రయుక్త రాష్ట్రాలను విచ్ఛిన్నం చేయరాదన్న సూత్రబద్ధ వైఖరికి కట్టుబడిన ప్రజాశక్తి, ఆంధ్రప్రదేశ్ విభజనను వ్యతిరేకించి సమైక్యత కోసం నిలబడింది. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు కూడబలుక్కొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ముక్కలు చేశాయి. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి



ప్యాకేజీ, కడప ఉక్కు, విశాఖ రైల్వేజోన్... ఇలా ఎన్నో హామీలిచ్చినా అవి నీటి మీద రాతలుగా మారాయి. ఈ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న కేంద్ర పాలకులను దోషులుగా నిలపడంలోనూ, రాష్ట్రంలోని పాలక, ప్రధాన ప్రతిపక్ష పార్టీల అవకాశవాద వైఖరిని ఎండగట్టే విషయంలోనూ ప్రజాశక్తి ముక్కుసూటిగా వ్యవహరిస్తోంది. విద్యుత్ ఛార్జీలను పెంచితే అది 1999లో గానీ, 2022లో గానీ పాలకుల విధానాలను, సంస్కరణల పేరిట సాగుతున్న దోపిడీని ప్రజలకు వివరించింది. ఇటీవల చెత్త పన్ను, ఆస్తి పన్ను పేరిట వేస్తున్న భారాలను ప్రతిఘటించడానికి జనానికి సమాచారాన్ని ఇవ్వడంలో ముందుంది. తరగతుల విలీనం పేరిట విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలు, వాటి పర్యవసానాలను ప్రజల ముందుంచింది. తమ హక్కుల సాధనకు ఉద్యమించే ఉద్యోగ, ఉపాధ్యాయులు, చిరువ్యాపారులు, మహిళలు, విద్యార్థి, యువజనులకు బాసటగా నిలుస్తోంది.

భారత స్వాతంత్ర్యానికి 75 ఏళ్లు నిండిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఉత్సవాలు జరుగుతున్నాయి. మహనీయుల త్యాగాలతో, ప్రజల పోరాటాలతో సాధించుకున్న స్వాతంత్ర్యానికి కార్పొరేట్, మతతత్వ శక్తుల మూలంగా ముప్పు ఏర్పడింది. మహత్తర స్వాతంత్ర్య పోరాటంలోనూ ప్రజాశక్తి పాలుపంచుకుంది. 1942లోనే పత్రిక ప్రారంభమైనా పాలకులు నిషేధం విధించడంతో నిలిచిపోయింది. తిరిగి 1968లో వారపత్రికగా వెలువడింది. 1981 ఆగస్టు ఒకటో తేదీ నుంచి దినపత్రికగా దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం ఎనిమిది కేంద్రాల నుంచి వెలువడుతోంది.

భరతమాత ముద్దుబిడ్డ పుచ్చలపల్లి సుందరయ్య చొరవతో పత్రిక స్థాపన, వ్యవస్థాపక సంపాదకునిగా మోటూరు హనుమంతరావు వేసిన పునాది, పత్రికను విస్తరింపజేయడంలో ఎనలేని కృషి సల్పిన కొరటాల సత్యనారాయణ వంటి మహామహులు, వారి సహచరులు చూపిన మహత్తర మార్గంలోనే ప్రజాశక్తి నడుస్తోంది. పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషుల విశేష ఆదరణ వల్లనే కోవిడ్ విపత్తుతో సహా అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ ఈ ప్రస్థానం అప్రతిహతంగా సాగుతోంది. మున్ముందు ఇంతకన్నా మిన్నగా ఆదరించి, ఆశీర్వదించాలని మనవి చేస్తున్నాం.

(బి.తులసీదాస్)

ప్రజాశక్తి తొలి సంపాదకుడు మద్దుకూరి చంద్రం



కృష్ణాజిల్లా వెంట్రప్రగడ గ్రామంలో 1907లో జన్మించిన మద్దుకూరి చంద్రశేఖరరావు స్వాతంత్ర్య ఉద్యమంలో చేరి అనేకసార్లు జైలుశిక్షను అనుభవించారు. ఆ తరువాత అంచెలంచెలుగా కాంగ్రెస్ పార్టీలో ఎదిగి 1935-36లో కృష్ణాజిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా ఎన్నికైనారు. ఆ పిమ్మట కొంతకాలం కాంగ్రెస్‌లోనే వామపక్షవాదిగా ఉండి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో చేరారు. అటుపిమ్మట కమ్యూనిస్టు పార్టీలో చేరి నాయకత్వ స్థాయికి ఎదిగారు.


కమ్యూనిస్టు పార్టీ ప్రాబల్యంలో ఉన్న కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ నాయకత్వంలో 1973లో రాజమండ్రిలో నెలకొల్పిన నవశక్తి వారపత్రికకు మద్దుకూరి చంద్రశేఖరరావు సంపాదకులుగా వ్యవహరించారు. ఆ తరువాత ఆ పత్రిక విజయవాడకు తరలించారు. నిర్బంధ కాలంలో రహస్యంగా నిర్వహించిన స్వతంత్ర భారత్‌కు ఆయన సంపాదకుడిగా ఉన్నారు. కమ్యూనిస్టుపార్టీకి బహిరంగంగా పనిచేయడానికి అవకాశాలు ఏర్పడిన తరువాత పార్టీ అధికార పత్రికగా ప్రారంభించబడిన ప్రజాశక్తి వారపత్రికకు 1942 నుండి 45 వరకూ సంపాదకులుగా ఆయన పనిచేశారు. అటుపిమ్మట 1952లో విశాలాంధ్ర దినపత్రికగా మారినప్పుడు దాని సంపాదకత్వ బాధ్యతలను ఆయన నిర్వహించారు. ప్రారంభంలో ప్రచురించబడిన నవశక్తి, ప్రజాశక్తి , విశాలాంధ్ర పత్రికలకు సంపాదకత్వాన్ని నెరపిన కారణంగా ఆయనకు కమ్యూనిస్టు పత్రికల పితామహుడుగా పేర్కొనడం జరిగింది. పత్రిక సంపాదకుడుగా ఉంటూనే తన వ్యాసాలద్వారా ఆయన అభ్యుదయ సాహిత్య ఉద్యమానికి ప్రజానాట్యమండలి కృషికి ఎంతగానో తోడ్పడి తెలుగు ప్రజల సాంస్కృతిక పునరుజ్జీవనానికి సహాయపడిన వారిలో ఆయన ప్రముఖులు.



భాషాభిమానం నిండిన 'కళామందిరం

ప్రజాశక్తి - గంగవరం

ఉపాధ్యాయ దంపతులు నాయుడు, తమ సొంత స్థలంలో సొంత నిధులతో నిర్మించుకున్న కళామందిరంలో నిర్విరామంగా కార్యక్రమాలు జరుపుతూ పలువురి మన్ననలు అందుకుంటున్నారు. కళామందిరం ప్రారంభించిన సంవత్సర కాలంలో సుమారు 100 కార్యక్రమాలు నిర్వహించి తమ భాషాభిమానాన్ని చాటుకున్నారు. సంవత్సర కాలంలో వేలాదిమంది పిల్లలు ఈ కళామందిరంలో బహుమతులు అందుకున్నారు. వందలాది మంది భాషాభిమానులు, కవులు, రచయితలు ఈ కళామందిరంలో సత్కారం అందుకున్నారు. చాలా మంది ప్రముఖులు కళామందిరాన్ని సందర్శించి అభినందనలు తెలియజేసారు. ఈ నెల 27వ తేదీన తెలుగు భాషా దినోత్సవాన్ని ముందుగానే నిర్వహిస్తున్నారు. వందకు పైగా పద్యాలు చెప్పగలిగే 100మంది పిల్లలకు బహుమతులు అందించబోతున్నారు. భాషాభిమానులకు సత్కారాలు చేయనున్నారు. ఇన్ని కార్యక్రమాలు నిర్వహించినా ఎవరి దగ్గర చేయి చాచకుండా తమ సొంత నిధులతోనే కార్యక్రమాలు నిర్వహించడం విశేషం. అటువంటి కళామందిరాన్ని సొంత స్థలంలో, సొంత నిధులతో నిర్మించిన తులసినాధం నాయుడు పుష్ప దంపతులకు తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా అభినందనలు తెలియజేద్దాం.







దీర్ఘకాలిక వ్యాధులు చిరుధాన్యాలతో చెక్





- మెరుగు భాస్కరయ్య, ఏడిఏ

మధుమేహం, స్థూలకాయం, కేన్సర్, గుండెజబ్బులు వంటి జీవనశైలి వ్యాధులతో బాధపడేవారికి, చిరుధాన్యాల ఆహారం దివ్యౌషధంగా పనిచేస్తుంది. నెమ్మదిగా జీర్ణమయ్యే పిండి పదార్థాల వల్ల మధుమేహం, స్థూలకాయం ఉన్నవారికి ఈ ఆహారం ఎంతో ఉపయోగకరం. ఎక్కువ పీచు పదార్థాలుండడంతో మలబద్ధకం, పేగుల కేన్సర్ వంటి జబ్బులతో బాధపడేవారికి ఈ ఆహారం చాలా మంచిది. చిరుధాన్యాలలో మెగ్నీషియం, ఇతర ఖనిజ లవణాలు అధికంగా ఉండడం వలన రక్తపోటు, గుండెజబ్బులు కేన్సర్‌లతో బాధపడే వారికి ఈ ఆహారం ఉపశమనాన్ని ఇస్తుంది. చిరుధాన్యాలలో అధికంగా ఉండే 'బి' విటమిను, ఫైటోకెమికల్స్ శరీరంలో కొలెస్ట్రాల్ సమస్యను తగ్గించడమేకాకుండా, కేన్సర్ నిరోధకంగా కూడా పనిచేస్తాయి.

చిరుధాన్యాల సాగులో రైతులకు అవరోధాలు

చిరుధాన్యాలను తక్కువ ఖర్చుతో సాగు చేయవచ్చునని, ప్రజల్లో వీటి వినియోగంపై అవగాహన పెరిగి, వీటికి డిమాండు పెరుగుతున్న విషయం రైతులకు తెలిసినా, రైతులు ఈ పంటల సాగుకు ఎక్కువగా ఆసక్తి కనపరచడం లేదు. ఎందుకంటే చిరుధాన్యాల సాగు సులభమైనప్పటికీ, కోత తర్వాత వీటిని మార్పిడి చేయడం సమస్యాత్మకంగా రైతులు భావిస్తున్నారు. ఈ పంటల నూర్పిడి కూలీలతో ముడిపడి కష్టంతో కూడుకున్నపని. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ కూలీల అందుబాటు అంతంత మాత్రంగానే ఉంది. ఉన్న వారు కూడా ఈ పంటల నూర్పిడి పనుల వలన చర్మ, కంటి ఆరోగ్య సమస్యలు ఎక్కువౌతాయని ఈ పనికి రావడం లేదని రైతులు ఎక్కువగా ఈ పంటల సాగుకు ముందుకు రావడం లేదు. ఈ పంటలను నూర్పిడి చేసే యంత్రాలు అక్కడక్కడ అభివృద్ధి చేసినా, ఈ పంటలను ఎక్కువగా సాగు చేసే చిన్న సన్నకారు రైతులకు ఈ యంత్రాల ధరలు అందుబాటులో లేవనేది రైతుల వాదన. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ శాస్త్రజ్ఞులు చిరుధాన్యాల నూర్పిడికి సన్న, చిన్న కారు రైతులకు అందుబాటులో ఉండే విధంగా, అన్ని ప్రాంతాలలో చౌకగా, సులభంగా లభించే విధంగా యంత్రాలను రూపకల్పన చేయాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది.

వాతావరణ మార్పులను తట్టుకొని, ప్రజానీకానికి ఆహార, ఆరోగ్య భద్రతనిచ్చే చిరుధాన్యాల ప్రాముఖ్యతను నేడు అంతర్జాతీయ సమాజం గుర్తించింది. వీటి ప్రాముఖ్యతను రైతులు, వినియోగదారులు మరియు ప్రభుత్వ విధానకర్తలలో అవగాహన కల్పించడానికి భారత దేశ సూచన మేరకు 2023 సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి "అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా" ప్రకటించింది. కాబట్టి వాతావరణ పరిస్థితులను తట్టుకొని, మన రైతాంగానికి స్థిరమైన దిగుబడులను ఇవ్వగలిగి, నేడు ప్రజల్లో ప్రబలుతున్న జీవనశైలి వ్యాధుల యాజమాన్యంలో కీలక పాత్ర పోషించగల చిరుధాన్యాల సాగుకు మరియు వినియోగానికి అందరూ తమ వంతు పాత్రను పోషించాల్సిన అవసరం ఉంది.

మా మంచి మాస్టార్'













సావిత్రిబాయ్ పూలే...నాకు నచ్చిన గురువు...!

"అమ్మకు జేజే నాన్నకు జేజే..చదువులు నేర్పే గురువుకు జేజే

చిన్నప్పుడు రాగంగా ఈ తెలుగు వాక్యాలు చెప్తున్నప్పుడు దాని అర్థం నాకు పెద్దగా తెలీదు. అమ్మ నాన్న తెలుసు, గురువు తెలుసు కానీ చదువేందో.. నేర్పేది ఏందో నాకు అసలు తెలిసేది కాదు. కానీ ఇప్పుడు నా చదువు, నేను నేర్చుకున్నది మొత్తాన్ని తలుచుకుంటే గురువులు అంటే.... ఉపాధ్యాయులు ఎంత చేశారో... ఏమి చేశారో.. నన్ను ఎలా మార్చారో తలుచుకుంటే ఆనందంతో కళ్లవెంబడి నీళ్లు వస్తుంది.

ఏమీ తెలియని నన్ను, ఇంట్లో ఆడుకుంటూ ఉండే నన్ను, స్కూల్లో వేసినప్పుడు నా ఏడుపును భరించిన టీచర్లు, నాకు అ, ఆ, ఇ, ఈ లు నేర్పిన టీచర్లు, నాకు ఏ, బి,సి,డి లు నేర్పిన టీచర్లు, నాకు ఒకటి, రెండు, మూడు నేర్పిన టీచర్లు.!. వారిని తలుచుకుంటే... వారి ఓపిక తలుచుకుంటే.. భలేగా అనిపిస్తుంది. ఆశ్చర్యమేస్తుంది, అభిమానమేస్తుంది, ఆనందమేస్తుంది. వారికి నేను శిష్యుడు కావడం... వారి దగ్గర నేర్చుకోవడం.. నేను ఎంత అదష్టవంతుడిని కదా.

అందుకే అన్నారు. మాతదేవోభవ...పితదేవోభవ ఆచార్యదేవోభవ.. ఎందుకంటే అమ్మ నాకు మొదటి గురువు కదా. చిన్నప్పుడు నేను మొదట చూసిందే అమ్మని కదా. అమ్మ పాలిస్తూ, బువ్వ తినిపిస్తూ, ఎన్నో మాటలు చెబుతూ నాకు చిన్న చిన్న పదాలు నేర్పించింది కదా. అందుకే అంటారు "ఇల్లు మొదటి పాఠశాల" అని తర్వాత రెండవ గురువు నాన్న. ఆయన నన్ను ఎత్తుకొని ఆడిస్తూ, జాంజి జపాంజీ అని ఊయల ఊగిస్తూ ఎన్నో నేర్పించారు. తర్వాత జీవితం గురువులదే కదా.. ఉపాధ్యాయులదే కదా.

గురు బ్రహ్మ...గురు విష్ణు గురు దేవో మహేశ్వర్ణ...గురు సాక్షాత్ పరబ్రహ్మ, తస్మైశ్రీ గురువే నమ్మ.

అలా ఉపాధ్యాయులకు నమస్కరిస్తూ నాకు నచ్చిన ఉపాధ్యాయుడు గురించి మీకు చెప్పాలని నాకనిపిస్తోంది. చెప్పేదా. మా ఉపాధ్యాయుల పేరు చెప్పను గాని వాళ్ళు నాకు ఎందుకు నచ్చారో? వారి లక్షణాలు ఏమిటో? మీకు వివరిస్తాను. సరేనా. ఇక్కడ మీకు ఒక ఉత్తరం పరిచయం చేస్తాను. అమెరికా అధ్యక్షులలో ఒకరైన అబ్రహం లింకన్ తన కొడుకు మొట్టమొదటిసారిగా స్కూలుకు పోయేటప్పుడు పాఠశాల గురువులకు ఒక లేఖ రాశాడు. ఆ లేఖ చాలా ప్రసిద్ధి చెందింది. దాన్ని ఒకసారి చదవండి.

"ఉపాధ్యాయునికి లేఖ"

"మా అబ్బాయి ఈరోజు మొదటిసారి స్కూల్‌కి వస్తున్నాడు. అక్కడ అంతా వాడికి కొత్తగానూ వింతగానూ ఉంటుంది. అందుకే మీరు వాడితో కొంచెం సున్నితంగా ఉండండి. ఈ సాహసమైన పని వాడు ఏడు సముద్రాలను దాటి వెళ్ళేందుకు సాయపడవచ్చు. విషాదాలు, దుఃఖాలు వాడికి అనుభవంలోకి రావచ్చు. అలాంటి జీవితంలో వాడికి నమ్మకం, ప్రేమ, ధైర్యం తోడుగా ఉండాలి. దయచేసి మీరు ప్రేమతో వాడు నేర్చుకోవాల్సినవన్నీ నేర్పిస్తారా! ఓ మిత్రుడు ఉంటే ఓ శత్రువు కూడా ఉంటాడని నేర్పండి. ఒక చెడ్డవాడు ఉన్నచోట ఒక వీరుడు కూడా ఉంటారని చెప్పండి. జిత్తుల మారి రాజకీయ నేత ఉండే చోట, అంకితభావంతో పనిచేసే నేత కూడా ఉంటారని చెప్పండి. ఊరికే దొరికే వంద రూపాయల కన్నా సొంతంగా సంపాదించుకున్న ఒక్క రూపాయి ఎక్కువ విలువైనదని నేర్పండి. స్కూల్లో మోసం చేసి గెలవడం కన్నా ఫెయిల్ అవ్వడం చాలా ఎక్కువ గౌరవంగా ఉంటుందని నేర్పండి. ఓడిపోయినప్పుడు అంగీకరించడం, గెలిచినప్పుడు మనస్ఫూర్తిగా ఆనందించడం నేర్పండి. అందరితో మదువుగా ప్రవర్తించమని, కఠినంగా ఉన్న వాళ్ళతో కఠినంగా ఉండమని నేర్పండి. ఓటమిలో కూడా కీర్తి ప్రతిష్టలు ఉండవచ్చు, గెలుపులో నిరాశ ఉండవచ్చని నేర్పండి. అసూయకు వాణ్ణి దూరంగా ఉంచండి. వాడు విచారంగా ఉన్నప్పుడు నవ్వడం నేర్పించండి. కన్నీళ్లు కార్చడం అవమానమేమీ కాదని నేర్పండి. పుస్తకాలు ఎంత అద్భుతంగా ఉంటాయో నేర్పండి. అందరూ చెప్పేది విని సత్యమనే జల్లెడలో వడపోసి మంచిని ' మాత్రమే గ్రహించమని చెప్పండి. మీరు వీలైనంతవరకు ప్రయత్నించి వాడిని మంచి పిల్లవాడిగా మార్చాలి. ఎందుకంటే, ఇది మీరు మాత్రమే చేయగలరు."

ఈ లేఖ ప్రపంచంలో మా పిల్లల గురించి రాసిన గొప్పలేఖ అని అంటారు. దీంట్లో ఉపాధ్యాయులు ఎలా ఉండాలో కూడా తెలుస్తుంది కదా. నాకు నచ్చిన ఉపాధ్యాయుడు ఈ లేఖలో మాదిరిగా వుంటారు. ప్రేమగా ఉంటారు, మదువుగా ఉంటారు. కఠినంగా ఉంటారు, మంచిని చెబుతారు, చెడును వివరిస్తారు. మేము తప్పు చేస్తే నాన్న లాగే దండిస్తాడు. "అస్తమానం కొడుతూ, భయపెడుతూ, అజమాయిషి చేస్తే భయంతో విద్యార్థులకు పాఠాలు బుర్రకు ఎక్కవు" అని ఆయన అంటారు.

ఒక్కొక్కరికి ఒక్క రకంగా జ్ఞాపకశక్తి, సామర్థ్యము ఉంటుంది కదా. జ్ఞాపకశక్తి తక్కువగా ఉండే పిల్లలను ఆయన ఎప్పుడూ కించపరచలేదు. పైగా జ్ఞాపకశక్తి మనుషులందరికి సహజమని... ఏకాగ్రత, విషయాలు అవగాహన, పట్టుదల, అవసరము, ఆత్మవిశ్వాసము మొదలైన వాటి వల్ల జ్ఞాపకశక్తి ఎలా పెరుగుతుందో ఆయన ఉదాహరణలతో వివరించేవారు. దాంతో కొంతమంది జ్ఞాపకశక్తి పెంచుకోవడం నాకు గుర్తుంది.

ఎవ్వరూ ఆత్మన్యూనత, అంటే "నేను అందరికంటే తక్కువ," అనే భావనకు లోను కాకుండా అందరిని ప్రోత్సహించేవారు. ఎప్పుడూ చదువేకాక మానసిక, శారీరక ఆరోగ్యం కోసం ఆటలు ఆడమని చెప్పేవారు. మాతో పాటు గ్రౌండ్కు వచ్చి ఎన్నో ఆటలు ఆడేవారు. మాతో పిల్లల లాగా కలిసి పోయేవారు. అప్పుడప్పుడు క్లాసులో పిట్టకథలు, హాస్యంతో చెప్పేవారు. మమ్మల్ని కూడా కథలు చెప్పమని ప్రోత్సహించేవారు. అందువల్ల నాకు కథల పుస్తకాలు చదవడం అలవాటయింది. ఆ అలవాటు వల్ల ఇప్పుడు కూడా నేను పుస్తకాలు చదువుతూనే ఉంటాను.

ఆయన పాఠాన్ని చెప్పేటప్పుడు ఆ సబ్జెక్టుపై మాకు ఇష్టం కలిగేలా చేసే వాళ్ళు. "టెస్ట్ బుక్ చదవడమే విద్య అనుకునే వాళ్ళు మాస్టర్లు అవుతారు. పిల్లల ద్వారా తెలుసుకోగలం అనుకునే వాళ్ళు వివేకవంతులు అవుతారు.



వివేకవంతులకు ప్రతి బిడ్డ ఓ అద్భుతం. ఓ ప్రాణమున్న పుస్తకము." అని గిజుబాయ్ అనే టీచరు అన్నాడట. మా గురువుగారు నిజంగా ఓ వివేకవంతుడు. ఆయన మమ్మల్ని ప్రాణమున్న పుస్తకం లాగానే చూసేవాళ్ళు. టెస్ట్ బుక్ లో ఉన్న సిలబస్ మాత్రమే చెప్పకుండా మాకు ఎన్నో విషయాలు చెప్పేవారు. మమ్మల్ని మాట్లాడించేవాళ్లు... మా ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకునేవారు. సిలబస్ ఒత్తిడి మాపై ఉన్నప్పటికీ మమ్మల్ని సంతోషంగా ఉంచాలని ఆయనెప్పుడు అనుకుంటూ ఉండేవారు.

మాకు రోజూ దినపత్రికల్లో ఉన్న వింతలు, ముఖ్య విషయాలు గురించి క్లాసు ప్రారంభంలో కొంతసేపు చెప్పేవాళ్ళు. మేము ఎవరైనా ఒంటరిగా ఉన్నప్పుడు మా కుటుంబ సభ్యుల గురించి, ఆర్థిక, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగేవారు. మాకు సలహాలు, సూచనలు చేసేవారు. ఒక్కొక్కసారి బీద పిల్లలకు ఫీజులు కూడా ఆయనే కట్టేవారు.

ఏ విషయమైనా పాజిటివ్గా ఎలా ఆలోచించాలి. స్నేహం విలువ, సామాజికత, నిజమైన దేశభక్తి గురించి " మాకు చెప్పేవారు. ఆయన ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ సరదాగా, పాటలు చెబుతారు. మేము విద్యార్థులము. మాకు కుదుమిస్తే పండుగే కదా. మేము పాఠం బాగా చెప్పే టీచర్ను దేవుడు లాగే ఆరాధిస్తాము. జీవితాంతము మర్చిపోకుండా గుర్తు పెట్టుకుంటాము. అలాంటి వాడే మా సార్.

ఉపాధ్యాయుడు అంటే ఫ్యాక్టరీలో జీవం లేని వస్తువులను తయారు చేసే కార్మికుడు కాదు కదా. క్రియేటివిటీ సుజనాత్మకత) ఉన్న పిల్లలను, వారితో కలిసిపోయి నడుస్తూ, భవిష్యత్తులోకి నడిపించే మార్గదర్శకుడు గురువు, తెలుసా.. పిల్లలను పెద్దల లోకంలోకి నడిపించుకుంటూ వెళ్లే వాడే ఉపాధ్యాయుడు. పిల్లలకు.. సమాజానికి వారధి లాంటివాడు ఉపాధ్యాయుడు. చదువు చెప్పే దాంట్లో అన్నిటికంటే ముఖ్యమైనది ఏది? గురువు... శిష్యుల మధ్య ఉండే సహజ సంబంధం కదా. అయితే ఇది ఉపాధ్యాయుడికి ఎప్పుడొస్తుంది?. పిల్లల్లో పిల్లవాడిగా మారిపోయినప్పుడే కదా.... ఈయన నాతోపాటు చదువుకునేవాడు. " అని పిల్లలు అనుకోవాలి. మేము మా ఉపాధ్యాయుడు గురించి అలానే అనుకునేవాళ్లం, ఆయన కూడా అలానే ఉండేవాడు.

ఆయన డ్రెస్, ఆయన భాష, ఆయన హావభావాలు మమ్మల్ని చాలా ఆకర్షించింది. ఆయన మాటల్లో హాస్యం, కబుర్లు ఆయన ఆటపాటలు మాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. టీచరు పని కేవలం పాఠాలు చెప్పడమే కాదు కదా, మా జీవితాలు కూడా ప్రభావితం చేయాలి. మేము కేవలం పుస్తకంలో ఉండే పాఠాలు మాత్రమే నేర్చుకోము, జీవితానికి కావలసిన అనేక పాఠాలు నేర్చుకుంటాం కదా. అలాంటి పాఠాలు నేర్పిన మా ఉపాధ్యాయులు నాకు చాలా ఇష్టమైనవారు. ఆయనే "నాకు నచ్చిన ఉపాధ్యాయులు."

"పిల్లలు - ఉపాధ్యాయులు" ఇవి రెండు తీయని జంట పదాలు.. "స్వేచ్ఛ పసితనాన్ని పరిమళింప చేస్తుందని దాని నుండే మంచి జీవితం పుట్టుకొస్తుందని, దాన్ని పిల్లలకి ప్రసాదించాలని మా ఉపాధ్యాయులు గారు భావించారు...." మాకు స్వేచ్ఛనిచ్చారు మార్పు నిచ్చారు. అలాంటి మా ఉపాధ్యాయులకు వందనం చేసుకుంటూ.. మేలు చేసిన మంచి మనిషికి వందనాలు వందనాలు.. వేల వేల వందనాలు.. వేలవేల వందనాలు.......

మూఢనమ్మకాలపై అవగాహన కలిగిస్తున్న
యుగంధర్







ప్రముఖ పర్యాటక కేంద్రం కృష్ణమ్మ కొండ

ప్రజాశక్తి-వి.కోట

మండల పరిధిలోని పాముగానిపల్లె సమీపంలో ప్రకతి సహజసిద్ధంగా ఏర్పడిన కొండపై అనంత కాలంగా భక్తుల కోర్కెలు తీర్చే కొండపైన దేవుడు శ్రీ వేణుగోపాలస్వామి కొలువైన ప్రాంతమే కష్ణమ్మ కొండ. గతంలో ఈ ప్రాంతానికి చెందిన కష్ణమ్మ అనే మహా భక్తురాలు తన ఆస్తిని సంపదను మొత్తం ఖర్చు చేసి కొండపై శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయ నిర్మాణం చేపట్టడంతో ఆమె పేరు పైనే కష్ణమ్మ కొండగా అలరారుతోంది. కొండ బండలపై ఎటువంటి పునాదులు లేకనే ఆలయాన్ని నిర్మించడం ఆశ్చర్యానికి అప్పటి సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ ఆలయంలోని ప్రతి శిల్పం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది. వీకోట పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ప్రముఖ పర్యాటక ,ఆధ్యాత్మిక కేంద్రంగా అలరారుతోంది. సామాన్య భక్తులకు అందుబాటులో ఓ కొలను ఈ కొండపై ఉండగా కొండకు పడమర భాగంలో సహజ సిద్ధంగా ఏర్పడిన దేవదొన నుండి నీటిని తీసుకొచ్చి పురోహితులు స్వామివారి సేవలో వినియోగిస్తుంటారు. జనవరి ఫస్ట్ ,కష్ణాష్టమి, దీపావళి ,శ్రావణమాసంలో సమీప గ్రామస్తుల తో పాటు మండల పరిధిలోని ప్రజలు, కుప్పం ప్రాంతం నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. ఎంతో ప్రాశస్త్యం కలిగిన క్షేత్రం ఒకానొక దశలో గుర్తుతెలియని వ్యక్తులు గుప్త నిధుల తవ్వకాలతో శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి నెలకొంది. స్థల మహత్యం స్వామి వారి కప, కొంతమంది నడుంబిగించడంతో దాతల సహకారంతో ఆలయం పూర్వ వైభవానికి శోభయమానంగా రూపుదిద్దుతుంది. ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అభివద్ధి విషయం గా వీకోట మండలానికి చెందిన చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ దష్టికి తీసుకెళ్లారు. జడ్పీ చైర్మన్ మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దష్టికి ఆలయ అభివద్ధి విషయం తీసుకెళ్లారు. ఆలయ గొప్పతనాన్ని వివరించడంతో ఇటీవల ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి స్వయంగా కొండపైకి వెళ్లి స్వామి వారిని దర్శించుకుని ఆలయ అభివద్ధికి రెండు కోట్ల రూపాయలు మంజూరు చేయ డం తో అభివద్ధి పనులు చేపట్టేందుకు టెండర్ల దశలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఆలయానికి కుప్పం ప్రాంతం నుండి భక్తులు స్వామివారిని తమ ఇలవేల్పుగా భావించి పెద్ద ఎత్తున పూజలు నిర్వహిస్తుంటారు ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివద్ధి చెందుతున్న కష్ణమ్మ కొండ రాబోవు కాలంలో మరింత అభివద్ధి



చెందేందుకు ప్రభుత్వం మరింత కషి చేయాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సిరులు కురిపించే 'డ్రాగన్ ఫ్రూట్'

ఆధునిక ఆదర్శ రైతు సిహెచ్ మోహన్ రావ్

ప్రజాశక్తి- వి కోట

ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువ పెట్టుబడితో అధిక లాభదాయక పంటలు పండించేందుకు రైతులు మొగ్గు చూపుతున్న తరుణంలో వినూత్న రీతిలో ఆధునిక పద్ధతులను అనుసరించి 'డ్రాగన్ ఫ్రూట్' సాగు తో లాభాలను ఆర్జిస్తున్నారు ఆదర్శ రైతు సిహెచ్ మోహన్ రావ్. వీ.కోట మండలానికి చెందిన సిహెచ్ మోహన్ రావ్ తిరుపతిలో వెటర్నరీ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ ఆపై పీహెచ్‌డి చేశారు. ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగం వైపు వెళ్లకుండా పదిమందికి తానే ఉపాధి కల్పించాలని లక్ష్యంతో హెరిటేజ్ పాల డైరీలో చేస్తున్న ఉద్యోగాన్ని విడిచి సొంతంగా కోళ్ల ఫారాలు, ఆపై పాలడెయిరీ, గ్యాస్ ఏజెన్సీ, హేచరీ, రియల్ ఎస్టేట్ రంగం తో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టి పదిమందికి ఉపాధిని కల్పిస్తున్నారు. ఎంత చేసినా వ్యవసాయ రంగంపై ఉన్న మక్కువతో కొబ్బరి తోటలు సాగు చేశారు. సాంప్రదాయ పంటలకు భిన్నంగా వినూత్నంగా మండల పరిధిలోని తోటకనుమ సమీపంలో ఐదు ఎకరాల సొంత పొలంలో తక్కువ నీటితో ఒక్కసారి పెట్టుబడితో 14 సంవత్సరాలు ఫలసాయం అందించే 'డ్రాగన్ ఫ్రూట్' ను సాగు చేస్తున్నారు. ఏడాదికి ఒకసారి పంట నాలుగు నుండి ఐదు నెలల పాటు దిగుబడి ఉంటుందన్నారు. మేలు జాతి వంగడం టెల్సిస్ రకం పోల్ అండ్ రింగ్ పద్ధతిలో మొక్కలు నాటినట్లు వారు తెలిపారు. జిల్లాలో ఈ రకం వంగడాలు ఇద్దరు రైతులు మాత్రమే సాగు చేయడం గమనార్హం. సంవత్సరానికి 15 టన్నులు దిగుబడి వస్తోందని ఎకరాకు 7 నుండి 8 లక్షల వరకు ఆదాయం లభిస్తుందన్నారు. రోగుల్లో ప్లేట్‌లెట్లు పెంచడానికి, బిపి, షుగర్ పేషంట్స్ లో రోగ నిరోధక శక్తిని పెంచడానికి ఎంతోఉపయోగపడుతుందన్నారు. దీనితో కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాల్లో వీటికి మంచి డిమాండ్ ఉందన్నారు. దుబాయ్ వంటి దేశాలకు తాను పండించిన పంటను ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. చదువుకున్న యువత వినూత్న రీతుల్లో ఆలోచించి పదిమందికి ఉపయోగపడేలా స్వయంగా ఎదిగేందుకు మన ప్రాంతంలో పుష్కలంగా ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ముందుకు రావాలన్నదే తన ఆలోచన అని 'ప్రజాశక్తి'కి తెలిపారు.






ప్రజాశక్తి స్వాగత గీతిక

"ప్రజాశక్తి" దినపత్రిక
నిజ కమ్యూనిజ వేదిక
శ్రామిక జన శ్రేయస్కర
సామ్య సంఘ సంస్థాపక
ధన స్వామ్య వర్గమ్ములు
నినదించే దిన వార్తల
సరిదిద్దుచు జనావళికి
సత్యముచాటే
గొంతుక
గణతంత్రము పేరు చెప్పి
గద్దెలెక్కి గద్దించే
అధినాధుల అవినీతిని
హడలగొట్టు అక్లేసిక
చెదరగొట్టు ఝుఝూభ్రిక
వస్తున్నది వస్తున్నది
వాస్తవాన్ని తెస్తున్నది
ప్రఖ్యాపన మార్క్సియము
వ్యాఖ్యానము
చేస్తున్నది
నడుం కట్టి తుడుంకొట్టి
నవ మార్గం వేస్తున్నది
సుత్తిపట్టి కొడవలెత్తి
శభరావం చేస్తున్నది
జనుల వలన జనుల కొరకు
జనరాజ్యం విత్తుకుంది
జయపతాక మెత్తుకుంది

ఆరుద్ర



కష్టించి పైకొచ్చిన వెంకటేగౌడ



ప్రజాశక్తి - వి.కోట

జీవితంలో మంచి రోజులు చూడాలని కష్టాలను దాటుకుంటూ ధైర్యంగా పట్టుదలతో పోరాడి అనుకున్న లక్ష్యాలను చేరుకున్న ప్రజా నాయకుడు పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ. తన చిన్నతనంలో చదువుకునేందుకు అవకాశం లేక కష్టాన్ని నమ్ముకుని బతుకుతెరువు కోసం పొరుగు రాష్ట్రానికి వెళ్లారు. ఎంత సంపాదన ఉన్నా పేద., సామాన్య ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో వి.కోట మండలంతో పాటు నియోజకవర్గంలోని ప్రభుత్వ బడుల్లోని పేద విద్యార్థులకు అన్ని విధాలా తన సహాయ సహకారాలు అందించారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో రాజకీయాల్లోకి వచ్చి వారి సహకారంతో చిన్న వయసులో 2019 లో జరిగిన ఎన్నికల్లో పలమనేరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహకారంతో పలమనేరు నియోజకవర్గంలోని ప్రతి 'గడపగడపకు ' అభివద్ధి సంక్షేమ ఫలాలు అందించడమే తన లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. 'పజాశక్తి' వార్షికోత్సవం పురస్కరించుకుని నియోజకవర్గ అభివృద్ధిని ఆయన వివరించారు. ఆయన మాటల్లోనే..

కాలువ పనులను పూర్తిచేసి నియోజకవర్గంలో సాగు, తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యం. వీకోట, బైరెడ్డిపల్లి మండలాల ప్రజల శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి కైగల్ నదిపై ప్రాజెక్టు నిర్మాణానికి అంచనాలు సిద్ధమయ్యాయి. గ్రామాల్లో నూతనంగా సిమెంట్ రోడ్లు, తాగునీటి సౌకర్యాలు మెరుగుకు చర్యలు చేపట్టాం. రాజకీయాలకు అతీతంగా అభివద్ధి సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించడమే లక్ష్యం. నియోజకవర్గాన్ని మరింత అభివద్ధి పరిచేందుకు అన్ని వర్గాల సహకారంతో ముందుకెళ తున్నాం.

నియోజకవర్గంలోని వీకోట మండలానికి చెందిన జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సహకారంతో నియోజకవర్గ అభివద్ధిపై ప్రత్యేక దష్టి సారించాం. అభివద్ధి పనులకు సహకరిస్తున్న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ప్రత్యేక కతజ్ఞతలు. ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు - నేడు పథకం ద్వారా విద్యావ్యవస్థలో సమూల మార్పు తీసుకు రానున్నాం. దీంతో పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందుబాటులోకి రానుంది. గ్రామస్థాయిలో సచివాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండగా గ్రామ వాలంటీర్ల వ్యవస్థ సామాన్య ప్రజలకు సేవలు అందించడంలో పారదర్శకంగా పనిచేస్తోంది. నియోజకవర్గంలో వోల్టేజ్ సమస్యను అధిగమించేందుకు నూతన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నాం. హంద్రీనీవా









సర్పంచ్ నుంచి రాష్ట్ర మంత్రిగా

'అమర్నాథ్ రెడ్డి'



ప్రజాశక్తి- వికోట: రాజకీయ ప్రస్థానంలో నూతనకాల్వ కుటుంబానిది జిల్లాలో ప్రత్యేక స్థానమన్నది జనమెరిగిన సత్యం. సమాజ సేవ, ప్రజాచైతన్యమే లక్ష్యంతో తన తండ్రి రాజకీయ వారసత్వాన్ని పునికి పుచ్చుకుని తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు పిలుపు మేరకు యుక్తవయసులో రాజకీయాల్లోకి అడుగుపెట్టి సర్పంచ్ నుండి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి వివిధ పదవులను అలంకరించి వాటికి వన్నెతెచ్చి రాష్ట్ర మంత్రి వరకు ఎదిగిన నాయకుడు నూతనకాల్వ అమర్నాథరెడ్డి.

రాజకీయ ఉద్దండులు తండ్రి నూతనకాల్వ రామకష్ణారెడ్డి గల్లి నుండి ఢిల్లీ దాకా ప్రజాసమస్యల పరిష్కారానికి చేసిన కషిని పునికి పుచ్చుకుని తండ్రికి తగ్గ తనయుడిగా తనదైన వాగ్ధాటితో ప్రజాసమస్యలపై పోరాడేతత్వం అలవర్చుకున్నారు అమర్నాథ్ రెడ్డి. అదే స్ఫూర్తితో తమ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాలలోనే కాకుండా జిల్లా రాజకీయాల్లో తనదైన స్థానాన్ని సొంతం చేసుకున్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఏపోరాటం చేసిన ప్రజల సహకారంతో తనదైన శైలిలో వాటిని విజయవంతం చేసేందుకు నిరంతరం కషి చేస్తున్నారు. కుగ్రామం కెలవాతి నుండి రాష్ట్రస్థాయికి ఎదిగినా సామాన్య కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడానికి నిరంతర పోరాడుతూ పలమనేరు నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా ఎదిగి ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా అనేక నూతన పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడంలో ప్రత్యేకశ్రద్ధ కనబరిచారు. కియా మోటర్ల పరిశ్రమ రాష్ట్రానికి తీసుకురావడంలో వారు చేసిన కషి మరువలేనిది. ప్రత్యర్థి పార్టీ నాయకులను కూడా తన వాగ్ధాటితో తనదైన శైలిలో దగ్గరికి తీసుకునే మనస్తత్వం ఉన్న నేత ఆయన. ఇటీవల తమ పార్టీ యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర రాయలసీమ ప్రాంతం మొత్తంలో అంతా తానై కార్యక్రమాలను విజయవంతం చేసి తన సత్తాను చాటి చెప్పారు. నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడే నేత మరెన్నో ఉన్నత పదవులు చేపట్టి ప్రజాసేవలో కొనసాగాలని అభిమానులు ఆశిస్తున్నారు.



పట్టు రైతులకు ప్రోత్సాహం ఎక్కడ..?

జిల్లాలోని పట్టు రైతులు పడమటి మండలాలైన కుప్పం, పలమనేరు, పుంగనూరు, బైరెడ్డిపల్లి, వీకోట మండలాల్లో అత్యధికంగా మల్బరీ పంట పండిస్తున్నారు. ఈరైతులను ప్రోత్సహించడానికి పంటను అభివద్ధి చేయడానికి గత 19 సంవత్సరాలుగా ప్రోత్సాహక ఇన్సెంటివ్ ఇస్తున్నారు. మొదట్లో 20 రూపాయలు తర్వాత 40 ఇప్పుడు 50 రూపాయలు ఇస్తున్నారు. ఇది కూడా నెలలో తరబడి బకాయి పెట్టి చెల్లిస్తున్నారు. అయితే గత నాలుగు సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా ఇచ్చిన పరిస్థితి లేదు. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో దాదాపు 25వేల మంది పట్టు రైతులకు 60 కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉంది. అంతేకాకుండా రైతులకు పట్టుగూళ్ళకు సంబంధించిన అన్ని రకాల పరికరాలు ప్రభుత్వమే సమకూర్చేది. నేడు ఎలాంటి పరికరాలు ఇవ్వడం లేదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మల్బరీ తోటలను విస్తారంగా పండించి పట్టు పరిశ్రమలపై కేంద్రీకరణ పెట్టాలని పదేపదే చెప్తూ వస్తున్నది. కేంద్ర ప్రభుత్వం 75శాతం రాష్ట్ర ప్రభుత్వం 25శాతం రైతులకు రుణాలు ఇస్తున్నారు. ఈపంట పండించాలంటే రైతు ముందుగా పెట్టుబడి పెట్టి చేస్తేనే తర్వాత వచ్చే పరిస్థితి ఉంది. కేంద్ర ప్రభుత్వం వాటా 70 శాతం రెగ్యులర్‌గా వస్తున్నప్పటికీ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే 25శాతం వాటా ఇవ్వడం లేదని ఒకరిపై ఒకరు పోటీపడి పూర్తిగా రైతులకు అన్యాయం చేస్తున్నారు. రైతే కష్టపడి అప్పో సప్పో చేసి పెట్టుబడి 20లక్షల రూపాయల వరకు పెట్టి పండిస్తుంటే కనీసం గిట్టుబాటు ధర కల్పించలేని పరిస్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయి. ఒక ఎకరా మల్బరీ పంట పండిస్తే పదిమందికి పరోక్షంగా జీవనోపాధి రెగ్యులర్‌గా ఉంటుంది. ఇలాంటి పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాల వలన రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది.

ఏడాదికి ఎనిమిది పంటలు...

పట్టు పురుగుల పెంపకాన్ని చేపట్టిన రైతులు ఏడాదిలో సగటునా ఎనిమిది పంటలు తీయవచ్చు. మల్బరీ తోటల్లో ఆకు లభ్యత బాగున్న వారు పది పంటలు కూడా తీస్తున్నారు. పట్టు పురుగు జీవితచక్రంలో గుడ్డు దశ నుంచి గూడు అల్లే వరకు ఐదు దశలు ఉంటాయి. మొత్తం నెల రోజుల్లో పట్టుగూళ్లు చేతికి వస్తాయి. ప్రస్తుతం చాకీ కేంద్రాల ద్వారా రెండో దశలో ఉన్న పట్టు పురుగులను రైతులకు అందిస్తున్నారు. ఇవి తొమ్మిది రోజుల వయస్సు ఉండి, రోగనిరోధక శక్తిని కలిగి ఉంటాయి. రైతులు వీటిని షెడ్లలో వేసి, నాణ్యమైన మల్బరీ ఆకును ఆహారంగా అందిస్తారు. 21రోజుల్లో మిగిలిన మూడు దశల్లో పురుగులు పట్టుగూళ్లను అల్లుతాయి. 100 గుడ్లకు 80 నుంచి 100 కిలోల పట్టుగూళ్లు ఉత్పత్తి అవుతాయి. ఒక పంట తీసిన తర్వాత మరో బ్యాచ్ కోసం తిరిగి షెడ్డును పూర్తిగా డిస్‌ఇన్ఫెక్టెడ్ చేస్తారు. 100గుడ్లను పెంచడానికి రెండెకరాల్లో మల్బరీ తోటను పెంచాల్సి ఉంటుంది. 100 గుడ్లకు 80 నుంచి 100 కిలోల వరకు పట్టుగూళ్లు ఉత్పత్తి అవుతాయి. సగటున 80కిలోల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పట్టుగూళ్ల ధర కిలోకు రూ.400వరకు ఉంది. సగటునా కిలోకు రూ.350చొప్పున విక్రయించినా 80కిలోలకు రూ.30వేల ఆదాయం వస్తుంది. ఇలా ఏడాదిలో 8సార్లు పట్టుగూళ్లను ఉత్పత్తి చేయవచ్చు. ఇంత చేసినా రైతుకు గిట్టుబాటు కావడం లేదు.

శాస్త్రీయ పద్ధతులు..

పట్టు పురుగుల పెంపకంలో శాస్త్రీయ విధానాలే నాణ్యమైన పట్టుగూళ్ల ఉత్పత్తికి దోహదం చేస్తాయి. వీటి షెడ్డునిర్మాణం కీలకమైంది. 'సిల్క్ సమగ్ర-2' ద్వారా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా గాలి, వెలుతురు తగిన విధంగా ఉండేలా 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు, 15 అడుగుల ఎత్తు కొలతలతో షెడ్డు నిర్మిస్తారు. ఈ షెడ్డు విస్తీర్ణం వెయ్యి చదరపు అడుగులు ఉంటుంది. ఒక పంట తీసిన వెంటనే మరో పంటకు సిద్ధం చేయడానికి డిస్‌ఇన్ఫెక్టడ్ చేస్తారు. రైతులకు అధికారులే అవరసరమైన మందులు అందిస్తారు. డ్రిప్ సౌకర్యం కూడా ఉన్నది. రెయిన్ గన్ల వినియోగంతో మల్బరీ ఆకు నాణ్యత పెరిగి మన్నికైన పట్టుగూళ్లు ఉత్పత్తి చేస్తున్నారు.

ప్రోత్సాహకాలు.. రాయితీలు అందడం లేదు

పట్టు పురుగులు పెంచుతున్న రైతులకు ప్రోత్సాహకాలతో పాటు రాయితీ ఇస్తున్నారు. పట్టు గూళ్లు ఉత్పత్తి చేసి అమ్మిన ప్రతి రైతుకు కిలోకు రూ.75లు పోత్సాహకం ఇస్తున్న నాలుగు సంవత్సరాలుగా అందడం లేదు. షెడ్డు నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీలకు రూ.2.92లక్షలు, జనరల్‌కు రూ.2.25లక్షలు, డిస్‌ఇన్ఫెక్టెడ్ మందుల కోసం ఎస్సీ, ఎస్టీలకు రూ.1750, జనరల్‌కు రూ.2500లు ఇవ్వాలి కాని దాని ఊసే లేదు. మల్బరీ తోట నాటిన ఎస్సీఎస్టీ రైతులకు రూ. 50,700, జనరల్ రైతులకు రూ. 30వేలు ఇస్తున్నది. ప్రభుత్వ నర్సరీల్లో ఒక్కో మల్బరీ మొక్కను రూ.2చొప్పున రైతులకు ఇస్తున్నారు. కొత్తగా షెడ్డు నిర్మించిన రైతులకు 10ప్లాస్టిక్ ట్రేలు, 300ప్లాస్టిక్ నేత్రికలు అందివ్వాలి ఎక్కడా రావడం లేదు.



తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం..

ప్రస్తుత పరిస్థితుల్లో ఇతర పంటలతో పోల్చితే పట్టు సాగు లాభదాయకం. ప్రతినెలా ఆదాయం వస్తుంది. తక్కువ పెట్టుడితో మరో పది మందికి ఉపాధి కల్పించవచ్చు. కానీ ఆచరణలో అలా లేదు. నీటి వినియోగం అత్యల్పం. ప్రభుత్వం రైతులకు రాయితీ ఇవ్వాలి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే రైతుల నుంచి పట్టుగూళ్లు కొనుగోలు చేయాలి అలా జరగడం లేదు. పట్టుగుడ్లు ఇచ్చినప్పటి నుంచి మార్కెట్‌లో విక్రయించేంత దాకా అధికారులు సహకారం అందడం లేదు..

ప్రభుత్వానికి టాక్స్ రూపంలో ..

పట్టుగూళ్ళు రైల్‌టాక్స్, రేలర్ ద్వారా టాక్స్, డిస్టర్, వీవర్, టెస్టర్, కలరింగ్, వ్యూవర్స్ ప్లస్ డిస్ట్రిబ్యూటర్లు ఇలా ఆరు రకాలుగా ప్రభుత్వానికి అత్యధిక టాక్స్ వస్తున్నది. మరిఇంత అత్యధికంగా వస్తున్న టాక్స్ ఆదాయాన్ని కూడా పక్కనపెట్టి ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతున్న పరిస్థితి ఉంది. పట్టు రైతుల పర్యవేక్షణపై మండలంలో ఎస్ఓ, డివిజన్ స్థాయిలో ఏడి. జిల్లా స్థాయిలో డిడి ఆర్‌జెడి టీముగా పట్టు రైతులు పరిస్థితిని వారు కావాల్సిన ప్రోత్సాహం ఇవ్వడానికి పర్యవేక్షించే అధికారులు ఉన్నారు. కానీ ఈ అధికారుల పరిస్థితి రైతుల గురించి పట్టించుకునే పరిస్థితి లేదు.

గతంలో రైతులకు అందుబాటులో ఉన్న కుప్పం, పుంగనూరు, చిత్తూరు, రీలింగ్ కేంద్రాలు తొలగించారు. దీంతో రైతులు దూరప్రాంతాలకు పక్క జిల్లాలకు వెళ్లి పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంది. రవాణా ఖర్చులు ఎక్కువ. ఇన్ని కష్టాలు పడి పంట రకరకాల కారణంతో సక్రమంగా రాకపోవడంతో ఉన్న పంటకు కూడా గిట్టుబాటు ధరలేక రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రోజురోజుకీ మల్బరీ పంట సాగు తగ్గిపోతున్నది. రైతులు గిట్టుబాటు కావడం లేదని ఇతరుల పంటలకు మారుతున్నారు. మరి ప్రభుత్వాలు లక్ష్యాలు ఎలా నెరవేరుతాయి. ఇప్పటికే జిల్లాలో రైతులు సమస్యలపై ఆందోళన చేస్తున్న పట్టించుకోవడం లేదు. పట్టు పండించిన రైతుకు మాత్రం గిట్టుబాటు ధర ఉండడం లేదు. కానీ దాని మీద ఆధారపడిన పరిశ్రమల అధిపతులు మాత్రం కోట్లకు పడగలెత్తుతున్నారు. పట్టుగూళ్ళు తర్వాత దారం తీసే వారు డిస్టర్బ్ వీవర్ కలరింగ్ ఇంతమంది లాభాలు ఉన్న రైతులకు మాత్రం గిట్టుబాటు ధర ఉండడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి పట్టు రైతులకు అన్ని రకాలుగా ప్రోత్సహించి గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులు చేసే ప్రతి పోరాటంలోనూ సిపిఎం వారి పక్షాన అండగా ఉంటుందని తెలిపారు.







వ్యాసకర్త : వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి


కష్టాన్ని నమ్ముకుని పేదరికాన్ని జయించిన అక్బర్



ప్రజాశక్తి- వికోట: పేదరికంలో పుట్టి నిరక్షరాసుడిగా పెరిగి కష్టాన్ని నమ్ముకుని పేదరికాన్ని జయించిన అతి సామాన్యుడే పేపర్ బాయ్ అక్బర్. వికోట పట్టణానికి చెందిన అక్బర్ తల్లిదండ్రులు నిరుపేదలు కావడంతో చిన్నతనం నుండి కష్టాన్ని నమ్ముకుని జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. మొదట వీకోటలో ఆర్టీసీ బస్టాండ్ లేకపోవడంతో రోడ్డుపైనే బస్సులకు లోడరుగా పనిచేస్తుండేవాడు. మండల కేంద్రమైన వికోటకి ఆర్టీసీ బస్టాండ్ మంజూరు కావడంతో పనులు ప్రారంభం నుండి బస్టాండ్ ప్రారంభోత్సవం వరకు అన్ని తానై పనిచేసేవాడు. అప్పటినుండి ఆర్టీసీ బస్సులకు అధికారికంగా లోడర్‌గా పనిచేస్తూ ఉండేవాడు. అనంతరం ఏఎన్ఎల్ పార్సెల్ సర్వీస్ ప్రారంభం కావడంతో లగేజీలను బస్సుల పైకి లోడ్‌చేసే హమాలీగా కూడా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రతిరోజు ఉదయం వివిధ దినపత్రికలు ఆర్టీసీ బస్టాండ్లో పార్సిల్ వేయడాన్ని గమనించాడు. ఉదయం ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు 'ప్రజాశక్తి' దినపత్రికతో పాటు వివిధ దినపత్రికలకు పేపర్ బాయ్‌గా పనిచేస్తూ అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తు మంచి గుర్తింపును కూడా పొందుతున్నాడు. కష్టాన్ని నమ్ముకుని పేదరికాన్ని జయించి ఇతర సహచరులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు అక్బర్.

నాటి రాజుల నుండి నేటి పాలకుల వరకు

వికోట మండలం చరిత్ర



ప్రజాశక్తి– వికోట: ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల కూడలిలోని అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతం, ప్రశాంత వాతావరణం, వ్యవసాయ, వ్యాపార అభివద్ధికి నిలయంతో దినదినాభివద్ధి చెందుతున్నది వీకోట మండలం. గతంలో ఈ ప్రాంతాన్ని వెంకటగిరి రాజావారు పాటించిన కారణంగా వారు పేరు మీద ఈ ప్రాంతం వెంకటగిరి కోటగా పిలవబడి కాలానుగుణంగా నేడు వీకోటగా మారిందని తెలుస్తోంది. అందుకు నిదర్శనంగా నాటి పాలకులు నిర్మించిన కోట ఆనవాళ్లు నేటికీ కనిపిస్తాయి. కాలానుగుణంగా రాజవంశాలు దుర్గంకోటగోడలు మరుగున పడుతున్నా ఈప్రాంత చరిత్రకు గుర్తుగా ఈశ్వర్‌నగర్ మిట్టపై ఉన్న రాతి స్తంభం గత వైభవం భావితరాలకు తెలియ చెప్పడానికి చిహ్నంగా మిగిలింది.

మైసూర్ సంస్థానాన్ని పాలించిన టిప్పు సుల్తాన్ మైసూర్ నుండి తమిళనాడు రాష్ట్రంలోని ఆర్కాట్ సంస్థానానికి వికోట మండలం మీదగా వెళ్లే వారిని అందుకు అనుగుణంగా వికోట, బంగ్లా ఊరు, నాయకనేరి ప్రాంతాల్లో తనపాలనలో నిర్మించిన విశ్రాంతి విడిది భవనాలు నేటికీ గత ఆనవాల్లుగా మిగిలాయి. నేటి పాలకులు వీకోటలోని బంగ్లాను జిల్లా పరిషత్ అతిథి భవనంగా ఆధునికరించి వాడకలోకి తీసుకొచ్చారు.

వీకోట మండలం దినదినాభివద్ధి చెందుతోంది. మండలంలోని కష్ణమ్మకొండ, దుముకు రాళ్లు ప్రముఖ పర్యాటక ఆధ్యాత్మిక కేంద్రాలుగా అలరిస్తున్నాయి. చల్లని వాతావరణం కావడంతో పాడిపరిశ్రమ, పట్టుపరిశ్రమ, వివిధ రకాల కూరగాయలు, పళ్ళు తోటలు, పూలసాగుతో పాటు ప్రజలు పలు వ్యాపారాలతో జీవనం సాగిస్తున్నారు. ప్రజలు ఆర్థికంగా ఎదిగేందుకు మార్కెటింగ్ వ్యవస్థ అందుబాటులో ఉంది. కుప్పం ప్రాంతంలో ప్రవేశపెట్టిన నూతన వ్యవసాయ విధానాలైన బిందు, తుంపర్ల సేద్యంతో అధిక పంటలు పండిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా నిర్వహిస్తున్నారు. వీకోట ప్రాంత కళాకారులు కంచి కామకోటి పీఠంతోపాటు టిటిడి ఉత్సవాలలో ఆస్థాన విద్వాంసులుగా కొనసాగుతూ ఈప్రాంతానికి మరింత గుర్తింపుని తీసుకొస్తున్నారు. పెరిగిన జనాభాకనుగునంగా రహదారులు, రవాణా సౌకర్యాలు, ఉన్నత విద్యాసంస్థలు, ఆరోగ్యకేంద్రాలు, ఆధ్యాత్మిక, వ్యాపార కేంద్రాలు విస్తరించాయి.

గ్రామపంచాయతీ వారు వసూలు చేసే గేటు నుండి జాతీయ రహదారులు వారు ఏర్పాటు చేసిన టోల్గేట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం వస్తోంది. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా 26 ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 116 ప్రాథమిక పాఠశాలలు మండలంలో ఉండటం గర్వకారణం. అనేక భాషలు, భిన్న సంస్కతులు సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఉత్సవాలు జాతర్లతో ఈ ప్రాంతం ప్రత్యేకతను చాటుకుంటోంది. కుప్పానికి హంద్రీనీవా జలాల తరలింపుకు కాలువ పనులు వీకోట మండలం మీదుగా చేపట్టడం, రెండు జాతీయ రహదారులు ఇదే మండలం మీదుగా ఆధునికరించడం, బెంగళూరు నుండి చెన్నైకు ఎక్స్ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణాలతో పాటు ఇటీవల బైపాస్ రోడ్డు మంజూరు కావడం వంటి అభివద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. 126 ఎకరాల కీలపల్లి చెరువు, దుముకురాళ్ళు, కైగల జలాశయం, గంగమ్మఏరు వంటి జలవనరులు అందుబాటులో ఉన్నాయి.

రాజకీయ చైతన్యం కలిగించిన నేతలు

నాగరికతకు తోడు రాజకీయ చైతన్యం కలిగిన వీకోట ప్రాంతం నుండి తోటకనుమకు చెందిన వెంకటేగౌడ పలమనేరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా విజయం సాధించి కొనసాగుతుండగా, ఇదే ప్రాంతానికి చెందిన గోవిందప్ప శ్రీనివాసులు ప్రస్తుత మూడు ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ చైర్మన్‌గా కొనసాగుతూ ఈ ప్రాంతానికి రాష్ట్రస్థాయి గుర్తింపును తీసుకొచ్చారు. అదేవిధంగా మండలానికి చెందిన సీనియర్ నాయకులు సి.రామచంద్ర నాయుడు సర్పంచ్, ఎంపీపీ, జడ్పీటీసీ, పదవులతోపాటు పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సేవలందించారు. అలాగే దివంగత మాజీ ఎంపీపీ కే.శీనప్ప తన వాగ్దాటితో ఈ ప్రాంతానికి జిల్లా నుండి జాతీయస్థాయి గుర్తింపుని తీసుకొచ్చారు. మండలానికి చెందిన మైందుల రామచంద్రుడు స్వయం కషితో ఎదిగి ప్రస్తుతం బిజెపి జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. మండలానికే చెందిన ఆర్‌హెచ్ జయరామిరెడ్డి గతంలో రెస్కో చైర్మన్‌గా, జాతీయ సిల్క్ బోర్డు మెంబర్‌గా సేవలందించి జాతీయస్థాయిలో ఈ ప్రాంతం పేరును చాటి చెప్పారు. అన్నింటికీ మించి గతంలో కుప్పం నియోజకవర్గంలో భాగమైన వీకోట మండల ప్రజలు ఓట్లతో గెలుపొంది నారా చంద్రబాబు నాయుడు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా కొనసాగడం ఈ ప్రాంతానికే గర్వకారణంగా నిలిచింది.


వీకోట చారిత్రక చిహ్నం రాతి స్తంభం

సేవ తత్పరుడు.. ప్రజాసేవలో ఘనుడు

ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు



ప్రజాశక్తి– వికోట: ప్రజలకు సేవ చేయాలన్న తపన, పట్టుదలతో సుమారు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రత్యర్థులపై విజయకేతనాన్ని ఎగురవేసి ఎన్నో ఉన్నత పదవులను అలంకరించి ప్రజల మన్ననలు పొందుతున్న సేవాతత్పరుడు సేవల్లో ఘనుడు మాజీ ఏఎంసీ చైర్మన్ రామచంద్ర నాయుడు (నాయకనేరి రాము).

హైకోర్టు మండలం నాయకులు సమీపంలోని లింగాపురంకు చెందిన రామచంద్ర నాయుడు చిన్న వయసులోనే 1980వ దశకంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ రాజకీయ ఉద్దండులు సివి రాజారెడ్డి పై సర్పంచ్‌గా పోటీచేసి గెలుపొందారు. అనంతర కాలంలో రాష్ట్రంలో ఎన్‌టి.రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించడంతో వారి సేవలకు ఆకర్షితుడై పార్టీ ఆవిర్భావం నుండి తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. పాముగానిపల్లి ఎంపీటీసీ సభ్యులుగా గెలుపొంది వీకోట మండల ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం 2006 సంవత్సరంలో జడ్పిటిసిగా ప్రజామద్దతుతో జయకేతనం ఎగురవేశారు. నిరంతరం అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న ప్రజాసమస్యలపై మండల అభివద్ధిపై పోరాడుతూ పార్టీ అధినాయకుడు చంద్రబాబు నాయుడు దష్టిని ఆకర్షించారు. పార్టీ అధినేత ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో పార్టీ చేపట్టే కార్యక్రమాలకు దీటుగా వికోట మండలంలో కార్యక్రమాలు విజయవంతం చేస్తూ అభివద్ధి పనులను మండలంలో వేగవంతం చేశారు. అటవీ సరిహద్దు ప్రాంతాలలోని చెరువులను అనుసంధానం చేస్తూ గొలుసుకట్టు చెరువులు అభివద్ధి చేశారు. కుప్పం జాతీయ రహదారిలోని కారకుంట నుండి మారుమూల గ్రామాలను కలుపుతూ నాయకనేరి సమీపంలోని పేర్నంబట్ రోడ్డుకు అనుసంధానం చేస్తూ వేసిన తారు రోడ్డు వారి దూరదష్టికి నిదర్శనం. మండలంలో పాఠశాలలను బలోపేతం చేస్తూ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు విద్యావ్యాప్తికి వారు విశేషంగా కషి చేశారు. వారిసేవలు గుర్తించిన అధిష్టానం గత తెలుగుదేశం ప్రభుత్వంలో పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించారు. పదవులతో పనిలేకుండా మండలంలో శాశ్వత ప్రభుత్వ భవనాల నిర్మాణానికి, రహదారుల అభివద్ధికి, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు విశేషంగా కషి చేశారు. మండలంలో పార్టీలకు అతీతంగా పెద్దరికంతో గౌరవింపబడే వ్యక్తిగా ముందుకెళ్తున్న రామచంద్ర నాయుడు మరిన్ని సేవాకార్యక్రమాలు అభివద్ధి పనులతో మరింత ఎత్తుకు ఎదగాలని మండల ప్రజలు అభిమానులు ఆశిస్తున్నారు.


ప్రముఖ పర్యాటక కేంద్రంగా దుముకురాళ్ల జలపాతం



ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి


చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలంలోని తీర్థం పంచాయతీ పరిధిలోగల కైగల్‌వద్ద గల దుముకురాలు జలపాతం ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. కైగల్ మరిదేవదొడ్డి గ్రామాల మధ్యలో పలమనేరు టు కుప్పం జాతీయ రహదారి నుండి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో కౌండిన్య అభయారణ్యంలో అందాల జలపాతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాధారణంగా వర్షాకాలంలో జూన్ నుండి ఆగస్టు వరకు కురిసేవర్షాలకు జలపాతం ఉధృతంగా ప్రవహిస్తూ ఉంటుంది. ఈకాలంలో జలపాతం పక్షులు కిలకిలరావాలతో పర్యాటకులను కనువిందు చేస్తుంది. అంతేకాక కర్ణాటకలో వర్షం కురిసినప్పుడు ఆ జలపాతానికి నీరు వచ్చి చేరుతుంది. ఇది సుమారు 30 అడుగుల ఎత్తు నుండి పెద్దపెద్ద రాళ్లపై జలపాతం దుమకడంతో ఈ జలపాతానికి దుముకురాలు జలపాతం అని పేరు వచ్చింది. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన రాజేంద్రప్రసాద్ సుమారు రెండు దశాబ్దాల క్రితం ప్రత్యేకచొరవ తీసుకొని జలపాతం కింద శివలింగాన్ని ఏర్పాటు చేయడంతో ఎక్కువమంది ముఖ్యమైన రోజుల్లో ఇక్కడికి వస్తుంటారు. అలాగే పర్యాటకులు జిల్లా నలుమూలలల నుండే కాకుండా పక్క రాష్ట్రాలైన కర్ణాటక తమిళనాడు నుండి కూడా ఇక్కడికి ఎక్కువ మంది వస్తుంటారు. సచివాలయంలో గ్రామస్తుల సమక్షంలో వేలంపాట నిర్వహించి ద్విచక్ర వాహనానికి రూ.30లు, కారుకి రూ.50లు చొప్పున వసూలు చేస్తూ ప్రతిఒక్కరిని ఆహ్వానిస్తున్నట్లు స్థానిక సర్పంచ్ జ్యోతి శ్రీనివాసులు ఎం.సురేష్ తెలిపారు. అంతేకాకుండా కర్ణాటక నుంచి వచ్చే నీటిని ఆదా చేసేందుకు డ్యామ్‌ను నిర్మించి తాగునీటి ప్రాజెక్టు నిర్మిస్తే బాగుంటుందని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.







జెడ్‌పి ఛైర్మన్‌కు అరుదైన గౌరవం



ప్రజాశక్తి- వికోట: ఓటమి ఒంటరితనం ఈ రెండు జీవితంలో చాలా నేర్పుతాయి. ఒకటి ఎలా గెలవాలన్నది నేర్పితే.. మరొకటి ఎవర్ని నమ్మాలో నేర్పుతుంది. సత్యాన్ని గ్రహించి ఓర్పుతో ముందుకెళ్లి విజయాన్ని అందుకున్న నేత ఉమ్మడి జిల్లా జెడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు.

తన తండ్రి గోవిందప్ప వికోట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ప్రజలకు చేసిన సేవలను స్ఫూర్తిగా పొంది తాను కూడా ప్రజలకు సేవ చేయాలని లక్ష్యంతో రాజకీయాల్లో ముందడుగు వేశారు. మొదట నుంచి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడుగా తనదైన దూకుడు స్వభావంతో అనర్గల వాగ్దాటితో సమస్యలపై పాలక పక్షాన్ని నిలదీస్తూ ప్రజాపక్షాన నిలిచారు. ఈక్రమంలో గోనుమాకులపల్లి పిఎసిఎస్ ఛైర్మన్‌గా ఎన్నికై తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. తండ్రి గోవిందప్ప వారసుడిగా వీకోట గ్రామపంచాయతీ సర్పంచ్‌గా పలుమార్లు పోటీచేసి ఓడిపోయినప్పటికీ ప్రజాక్షేత్రంలో ప్రజల పక్షాన నిలబడ్డారు. దివంగత మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డిపై ఉన్న అభిమానంతో వారి మరణానంతరం కాంగ్రెస్ పార్టీని వీడి మండలంలో వైసిపి బలోపేతానికి విశేషంగా కషి చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి సన్నిహితులు కావడంతో వీకోట జెడ్పిటిసిగా ఎన్నికై రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లాలు పునర్విభజనలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలుగా విడిపోయిన ఉమ్మడి జిల్లాల జడ్పీ ఛైర్మన్‌గా తన సేవలను అందిస్తూ అరుదైన గౌరవం దక్కించుకున్నారు. పాలకపక్ష అగ్రనేతలతో ఉన్న సాన్నిహిత్యంతో నిధులు సమకూర్చుకొని జిల్లా పరిషత్ నుండి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పినకు విశేషంగా కషి చేస్తున్నారు. అనునిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రభుత్వ, ప్రైవేటు కార్యకలాపాలలో నిరంతరం పాల్గొంటున్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నిలుస్తూ జిల్లా పరిషత్ ఛైర్మన్ స్థానానికి వన్నెతెస్తున్నారు గోవిందప్ప శ్రీనివాసులు.









అభివృద్ధి పథంలో ద్రావిడ విశ్వవిద్యాలయం





ప్రజాశక్తి - గుడిపల్లి

ద్రావిడ రాష్ట్రాల కూడలిలోని కుప్పం ప్రాంతంలో 1997 అక్టోబర్ 20న ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ద్రావిడ భాషలు, సంస్కృతి పరిరక్షణ, అభివద్ధి పరుచుకునే లక్ష్యంతో ద్రావిడ విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. విశ్వవిద్యాలయ స్థాపన కోసం ప్రభుత్వం 1000 ఎకరాలకుపైగా స్థలాన్ని కేటాయించింది. కంప్యూటర్ సైన్స్, సిడిఎల్పి, చరిత్ర విభాగాలతో ప్రారంభమై ప్రస్తుతం 30 విభాగాలకు విస్తరించింది. ద్రావిడ విశ్వవిద్యాలయం క్యాంపస్ పచ్చదనంతో ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ప్రస్తుతం ద్రావిడ విశ్వవిద్యాలయం వివాదాలకు దూరంగా అభివద్ధి పథంలో ముందుకెళుతోంది.

ద్రావిడ భాషలు, సంస్కతులపై విస్తతమైన పరిశోధనలు వర్సిటీలో కొనసాగుతున్నాయి. సంస్కృతి, భాష, చరిత్ర పరిరక్షణకు నాలుగు రాష్ట్రాల నుంచి 27 భాషల్లో అనేక వందల మంది పరిశోధకులు, పరిశోధనలకు వేదికగా నిలిచింది. వందల సంఖ్యలో గ్రంథాలు.. వేల సంఖ్యలో పరిశోధనల పత్రాలు ప్రచురించి ద్రవిడ భాష, శాస్త్ర, జానపద కలలకు జీవం పోస్తోంది. ఇప్పటి వరకు 500 మందికి పైగా విద్యార్థులు పిహెచిడి పట్టాలు అందుకున్నారు. జానపద కళలు, భాషలు ఇలా అనేక అంశాలపై పరిశోధనలు సాగుతున్నాయి. వర్సిటీకి మొదట వీసీగా వచ్చిన ఆచార్య అరుణాచలం నుండి ప్రస్తుత వీసీ ఆచార్య తుమ్మల రామకష్ణ వరకు -ప్రతి ఒక్కరూ వర్సిటీ అభివద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందించారు.

వర్సిటీకి నాక్ "బి" గ్రేడు గుర్తింపు.....

ద్రావిడ విశ్వవిద్యాలయ అభివద్ధికి "నాక్" గుర్తింపు కోసం 2018, ఆగష్టు 9, 10, 11వ తేదీల్లో ఐదుగురు బందంతో కూడిన నాక్ కమిటీ సభ్యులు వర్సిటీని సందర్శించి నివేదికను ప్రభుత్వానికి పంపారు. సెప్టెంబర్లో వర్సిటీకి నాక్ "బి" గ్రేడును కేటాయించారు. దీంతో ద్రావిడ విశ్వవిద్యాలయం దేశ, ప్రపంచ పుటల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నట్లు అయింది. ఈ గుర్తింపు కారణంగా వర్సిటీకి అదనంగా యు.సి.సి నుండి సంవత్సరానికి రూ.5 కోట్ల వరకు నిధులు రానుంది. అదేవిధంగా వర్సిటీ అభివద్ధికి నాక్ గుర్తింపు ఎంతగానో దోహదపడింది.

దేశంలోనే స్వచ్ఛ క్యాంపస్‌లో 9వ స్థానం

ద్రావిడ విశ్వవిద్యాలయానికి స్వచ్ఛ క్యాంపస్ ర్యాంకింగ్ భారతదేశంలోనే 9వ స్థానం లభించింది. దేశ నలుమూలల నుండి విద్యా సంస్థలు 6 వేలకు పైగా దరఖాస్తులు చేసుకున్నారు. కమిటీ 200 విద్యా సంస్థలను స్క్రూట్నీ చేసి స్వచ్ఛభారత్ కమిటీ సభ్యులు విద్యా సంస్థల్లో పర్యటించి నివేదికలు పంపారు. వీటిలో మొదటి పది స్థానాలను ప్రకటించగా ద్రావిడ విశ్వవిద్యాలయానికి 9వ స్థానం దక్కింది. ఢిల్లీలో కేంద్ర మంత్రి ప్రకాష్ జవదేకర్ చేతుల మీదుగా అవార్డును, ప్రశంసా పత్రాన్ని వర్సిటీ వైస్-ఛాన్సరల్, రిజిస్ట్రార్లు అక్టోబర్ 1, 2018న అందుకున్నారు.

ఆడిటోరియం, లైబ్రరీ భవనాలు వర్సిటీకి మచ్చుతునకలు



వర్సిటీలోని ఆడిటోరియంలో భాగంగా ఓ వైపు సెమినారు హాలు, మరో వైపు ఆడిటోరియంను నిర్మించారు. వర్సిటీలో ఆడిటోరియం, నూతన లైబ్రరీ భవనాలు మచ్చుతునకలుగా నిలుస్తుంది. ఈ లైబ్రరీ భవనాన్ని యు.జి.సి నిధులతో రూ.4,00,19,256లతో నిర్మించారు. దీంతో పాటు వర్సిటీ హాస్టల్ భవనాలు, ప్రతి విభాగం వద్ద పార్కింగ్ షెడ్లును నిర్మించారు. అదేవిధంగా వర్సిటీలో నూతన హెల్త్ సెంటర్ భవనాన్ని పూర్తి చేసి ప్రారంభించారు. ద్రావిడ విశ్వవిద్యాలయంలో 7వేల పుస్తకాలతో ప్రారంభమైన గ్రంథాలయం నేడు.. 90 వేలకుపైగా పుస్తకాలను కలిగివుంది. 2012లో ఏర్పాటైన డిజిటల్ గ్రంథాలయంలో ప్రతి విద్యార్థి ఉచితంగా గంటపాటు అంతర్జాల సేవలు పొందే అవకాశాన్ని కల్పించారు. ప్రతి రోజూ విద్యార్థులు డిజిటల్ గ్రంథాలయంలో అంతర్జాల సేవలు అందుకుంటున్నారు.



వర్సిటీలో శిల్పకళా సౌందర్యం...

ద్రావిడ విశ్వవిద్యాలయంలో కర్ణాటక శిల్పకళా అకాడమీ వారి సహకారంతో శిల్పకళలపై జరిగిన వర్కుషాపులో రూపుదిద్దుకున్న 10 శిల్పకళా ఖండాలను విశ్వవిద్యాలయంలో వ్యూహాత్మక ప్రదేశాల్లో అమర్చడంతో పాటు ప్రతి విభాగం ముందు రాతిఫలకలపై ఆయా విభాగం యొక్క ప్రాధాన్యతను, ఆశయాలను తెలిపే విధంగా అమర్చారు. దీంతో వర్సిటీ క్యాంపస్లో శిల్పకళా సౌందర్యంతో అందర్నీ ఆకర్షిస్తున్నాయి.

ప్రచురణల కేంద్రంతో పుస్తకాలు, జర్నల్స్ ప్రచురణలు...

ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రచురణల కేంద్రం ద్వారా ద్రావిడ భాషలతో పాటు ఆంగ్లంలో పుస్తకాలను ప్రచురిస్తున్నారు. ప్రస్తుతం ప్రచురణల కేంద్రం ద్వారా తెలుగు, తమిళం, కన్నడం, తుళు, మళయాలం భాషలతో పాటు ఆంగ్లంలో 300 పుస్తకాల దాకా ప్రచురించి దేశం మొత్తం అమ్మకాలు చేస్తున్నారు. దీంతో పాటు తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, ఆంగ్ల భాషల్లో పరిశోధన పత్రికలు వెలువరిస్తున్నారు.

ద్రవిడ జానపద కళల పరిరక్షణ....

జానపద కళల పరిరక్షణకు వర్సిటీలో ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేసి.. పురాతన వస్తువులు సేకరించి ఒక ప్రదర్శన శాలను అందుబాటులో ఉంచారు. జానపద గిరిజన అధ్యయన శాఖ తరఫున విస్తత స్థాయిలో పరిశోధనలు సాగించడానికి అంతరించిపోతున్న చిన్నచిన్న భాషలను గుర్తించి వాటిని భద్రపరచడం జరుగుతోంది.


మూలికలపై పరిశోధనలు...

భారతదేశంలో అంతరించిపోతున్న మూలికా వైద్యాన్ని భావితరాలకు అందించాలన్న ఆశయంతో విశ్వవిద్యాలయంలో మూలికా వనాన్ని ఏర్పాటు చేశారు. 10 ఎకరాల విస్తీర్ణంలో 2500 వనమూలికల మొక్కలు పెంచుతున్నారు. ఈ మొక్కలతో బయోటెక్నాలజీ విభాగం పర్యవేక్షణలో పరిశోధక విద్యార్థులు ప్రయోగాలు చేస్తున్నారు.

వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

ద్రావిడ విశ్వవిద్యాలయం అభివద్ధికి కషి చేస్తున్నాం. వర్సిటీలో విద్యార్థులకు హాస్టల్స్, మెస్, ఇంటర్నెట్, త్వరితగతిన పరీక్షలు, ఫలితాలు విడుదల లాంటి అన్ని మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నాం. ఇప్పటికే వర్సిటీకి జి ఎంట్రన్స్ టెస్ట్ సెంటర్ను సాధించాం. ద్రావిడ విశ్వవిద్యాలయం ఏర్పాటైన లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నాం. వర్సిటీ న్యాక్ ఏ గ్రేడు గుర్తింపుకు అన్ని విధాలా శ్రమిస్తున్నాం.

- ఆచార్య ఎ.కె.వేణుగోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం







ఐరాల కృష్ణవేణికి డాక్టరేట్





ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని జయకుమార్ భార్య ఐరాల కృష్ణవేణి ఎంఏ, డిటి, ఇఎల్ఎల్‌బి వరకు చదువుకున్నారు. ఈమె 1988 సంవత్సరంలో ఎంపిపి పాఠశాల ప్రధానో పాధ్యాయులుగా పనిచేస్తూ ఉన్నారు. 1995లో హెచ్‌ఎంగా రాజీనామా చేసి మండల అధ్యక్షురాలు పదవికి పోటీ చేసి నాగిరెడ్డిపల్లి మేళప్ప భార్య కష్ణమ్మపై 450ఓట్ల ఆధిక్యంతో గెలుపొందింది. 1995 నుండి మండల అధ్యక్షురాలుగా 2000 సంవత్సరం మార్చినెల వరకు కొనసాగారు. 2005 సోషల్‌వెల్ఫేర్ బోర్డ్‌మెంబర్‌గా సెలెక్ట్ అయింది. అలాగే కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర మహిళ కాంగ్రెస్ కార్యదర్శిగా, 2006 రాష్ట్ర పంచాయతీరాజ్ జాయింట్ కన్వీనర్ గా బాధ్యతలు నిర్వహించారు. అలాగే 2012 నుండి కష్ణవేణి గ్రామీణ వితరక్ ప్రోపరేటర్‌గా, 2001లో సాయివిద్యానికేతన్ నిర్వహరాలుగా 2018 వరకు కొనసాగారు. 2018 ఇండియన్ గ్యాస్ డీలర్‌గా కొనసాగుతూ మండల ప్రజలకు ఇంటి వద్దకే నూతన గ్యాస్ అందించారు. ఈనేపథ్యంలో 2022 మే 6వ తేదీన తిరుపతిలోని ఎస్వీ యూనివర్శి నుంచి డాక్టరేట్, సర్టియావర్డ్ అచివర్స్ అవార్డును అందుకున్నారు. అలాగే జులై 15న భారత్ కీర్తి పురస్కారం అందుకున్నారు.



దేశభక్తి పెంపొందించిందికే జాతీయ గీతాలాపన

ఐదేళ్లుగా ప్రతిరోజు ఆలాపన

ప్రజాశక్తి- పుంగనూరు: జాతీయ గీతంపై భక్తిని పెంపొందించిందికే ప్రతిరోజు జాతీయ గీతం ఆలాపన జరుగుతున్నది. ఐదు సంవత్సరాలుగా నిరంతరాయం ప్రతిరోజూ జాతీయ గీతాన్ని ఆలాపించడం జరుగుతుంది. ఐదేళ్లుగా సమయం తప్పకుండా జాతీయ గీతాన్ని రోజుకు ఒకసారి పట్టణమంతా ఆలాపించే విధానం కొనసాగుతోంది. రాష్ట్ర విద్యుత్ అటవీ భూగర్భ గనుల శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రమైన పుంగనూరు పట్టణంలో


జాతీయ గీతాన్ని అలాపిస్తున్న అధికారులు, ప్రజలు (ఫైల్ ఫొటో)



ప్రతిరోజు ఉదయం 8 గంటలకు జాతీయ గీతం ఆలాపన చేపడతారు. ఈ కార్యక్రమం 15 ఆగస్టు 2017 నుండి ప్రారంభించారు. దీనికి ప్రధానంగా పట్టణానికి చెందిన న్యాయవాది, జర్నలిస్టు పిఎన్ఎస్.ప్రకాష్ ఆలోచనలతో ఓ కమిటీని అప్పట్లో ఏర్పాటు చేశారు. జాతీయ గీతాలపన కమిటీ పి.అయూబ్ ఖాన్, వి.దీపక్, మర్రి మాకులపల్లి బాబు, రెడ్డిప్రసాద్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని ఉన్నతమైన లక్ష్యంతో ప్రారంభించారు. అప్పటి నుండి ఇప్పటివరకు దిగ్విజయంగా ప్రతినిత్యం కొనసాగుతున్నది.

ప్రధానంగా ప్రజల్లో యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. అప్పట్లో ఉన్న మున్సిపల్ కమిషనర్ కేఎల్.వర్మ ఆధ్వర్యంలో పట్టణంలో ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. కమిటీ సొంతనిధులతో పట్టణంలో 20 హార్న్ ఏర్పాటు చేసి పట్టణమంతా వినిపించేలాగా కార్యక్రమాన్ని చేపట్టారు. 60వేలు జనాభా ఉన్న పుంగనూరు మున్సిపల్ కేంద్రంలో మతాలు, కులాలతో సంబంధం లేకుండా జాతీయ గీతాన్ని గౌరవిస్తూ ఉదయం ఏడు గంటల 55 నిమిషాలకు సైరన్ వస్తుంది. కచ్చితంగా ఎనిమిది గంటలకు జాతీయ గీతం ఆలాపన రావడం జరుగుతుంది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి సూచనలతో ప్రజలు, పోలీసులు సహాయంతో కార్యక్రమం నిరంతరం జరుగుతున్నది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 1919 సంవత్సరం మదనపల్లిలో బీటీ కళాశాల గీతం తొలిసారిగా రవీంద్రనాథ్ ఠాగూర్ అనువాదం చేసి పాడించగా నేడు పుంగనూరులో వేలాదిమంది జనగణనను ఆలపించుతున్నారు.

మూడు అడుగుల ఎత్తు.. మూడు లక్షలు విలువ..

పుంగనూరు ఆవుకు భలే డిమాండ్

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు ఆవుకు భలే డిమాండ్.. ఎత్తు మూడు అడుగులు మాత్రమే.. విలువ మాత్రం మూడు లక్షల పైమాటే పలుకుతుంది. మూడు అడుగుల ఎత్తుండే ఈ ఆవు ఇంట్లో ఉంటే అంతా మంచే జరుగుతుందని ఇక్కడి ప్రజలు నమ్మకం. పుంగనూరు ఆవులకు డిమాండ్ ఎందుకు.? ఉండేది మూడు అడుగులు, విలువ మాత్రం మూడు లక్షల పైమాటే. ఈ ఆవుల ప్రత్యేకతలు ఏమిటని చాలా మంది తెలియని వారు అనుకుంటుంటారు. అయితే ఈ ఆవులకు చాలా ప్రత్యేకతలు ఉన్నాయి.

ఆ పుంగనూరు ఆవుల కాళ్లు పొట్టిగా ఉండి, ఎత్తు 70 నుంచి 90 సెంటీమీటర్లు ఉంటాయి. గతంలో రూ.30వేలు పలికిన ఆవుల ధర.. ఇప్పుడు రూ.3 నుంచి 5 లక్షల వరకు ధరలు పలుకుతున్నాయి. అంతేకాదు నిత్యం పూజిస్తే.. ఐశ్వర్య ఆరోగ్యాలు సిద్ధిస్తాయని.. చాలా మంది విశ్వాసం. పుంగనూరు ఆవులు దేశంలోనే ప్రత్యేకమైనవిగా గుర్తింపు తెచ్చుకున్నాయి. ప్రపంచ దేశాల్లో అనేక రకాల ఆవులు ఉన్నప్పటికీ.. పుంగనూరు ఆవులకు ఉన్నంత గిరాకీ.. మరే ఆవులకూ లేదు. సాధారణ ఆవుల మాదిరిగా కాకుండా ఈఆవులు కేవలం మూడు అడుగుల పొడవు ఉండి, ముద్దుగా, ఆకర్షణీయంగా ఉంటాయి. పుంగనూరు ఆవులకు.. వాసన పసిగట్టే సామర్థ్యం ఉంది. ఈ సామర్థ్యంతో ఎక్కడికి వెళ్లినా కూడా తిరిగి అదే మార్గంలో వెనక్కి వచ్చేయగలగడం వీటి ప్రత్యేకత. ఈ జాతి ఆవులు ఎంతటి ఎండనైనా, ఎలాంటి చలినైనా తట్టుకుని జీవించగలవు. సాధారణంగా ఇవి 2 అడుగుల 4 అంగుళాల నుంచి 3 అడుగుల వరకు ఎత్తు పెరిగి.., 250 కేజీల బరువు కలిగి ఉంటాయి. పుంగనూరు ఆవులకు ఎంత డిమాండ్ ఉందంటే.. 2007లో వీటి ధర కేవలం ముప్పై వేల పలికేది. కానీ ప్రస్తుతం వీటి ధర మూడు నుంచి ఐదు లక్షల వరకూ పలుకుతోంది.

పుంగనూరు ఆవు పాలకు ఔషధ గుణాలు ఉన్నాయి. సాధారణ ఆవు పాలతో పోలిస్తే వెన్నశాతం కూడా ఆరు నుంచి ఎనిమిది శాతం వరకు ఎక్కువగా ఉంటుంది. అంతేకాదు తక్కువ పాలు ఇచ్చానా వెన్న శాతం ఎక్కువగా ఉంటుందని చెబుతారు. అంతేకాదు ఈ ఆవు పాలు రుచికరంగా ఉంటాయని.. కొవ్వు పదార్థాలు తక్కువగా ఉంటాయి. సంప్రదాయ వైద్యవిధానంలో ఈ ఆవుపాలను వినియోగిస్తారట. అందుకే ఆంధ్రప్రదేశ్‌లో కొందరు పుంగనూరు ఆవులను ప్రత్యేక శ్రద్ధతో పోషిస్తున్నారు.

